₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్


సంపుటి - 10 పక్షపత్రిక సంచిక - 12

జూన్ 16-30, 2019



## ప్రజలకు-పాలనకు లింకు తెగిపోయింది







# పవిత్ర యుద్ధం X పవిత్ర వ్యాసంగం









# ‘చారిత్రక వ్యక్తులపై కొత్త తీర్పులు’.... బురదజల్లుడు – నెత్తికెత్తుడు!

చారిత్రక వ్యక్తులుగా కొనసాగుతున్నవారిపై బురద జల్లటం, కొత్తవారిని ఆరాధించటం ఇటీవల భారత్‌లో, ప్రపంచంలోని కొన్ని దేశాల్లో కూడా ఒక ట్రెండ్‌గా మారటంపై ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) పరిశోధకుల బృందం యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ రాజనీతి శాస్త్ర ఆచార్యుడు కేసీ సూరితో చర్చించారు. ఎవరు చెబుతున్నారు.. అనే దాన్ని బట్టి చరిత్ర మారే అవకాశముందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. అందువల్ల నిర్ధారణలకు వచ్చే ముందు చారిత్రక సందర్భాన్ని, పరిస్థితుల్ని జాగ్రత్తగా అంచనా వేయాలని సూచించారు. భారత్‌లోని రాజకీయ పార్టీలు, వాటి భావజాలాలు, రెండు పార్టీల వ్యవస్థ, నోటా, రాజకీయ చర్చా ప్రమాణాలు తదితర అంశాలను కూడా ఈ సందర్భంగా ఎఫ్‌డీఆర్ టీం చర్చించింది. ‘సైన్యాన్ని ఒక జనరల్ సృష్టించగలడని, కానీ సైన్యం ఒక జనరల్‌ని సృష్టించలేదని... అదేరీతిన పార్టీని ఒక నాయకుడు సృష్టించగలడుగానీ పార్టీ ఒక నాయకుడిని సృష్టించలేదని’ సూరి అన్నారు. విధానాల రూపకల్పనలో, కొన్ని ఎజెండాలను ముందుకు తీసుకెళ్లటంలో రాజకీయ నాయకుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ మాట్లాడుతూ, చరిత్రను చూసేటప్పుడు అప్పటి సందర్భాన్ని, నేపథ్యాన్ని తప్పక పరిగణలోకి తీసుకోవాలని, మేధో ఉదారతను వినమ్రతను ప్రదర్శిస్తూ అంచనా వేయాలని సూచించారు.



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

జూన్16-30, 2019 సంపుటి - 10 సంచిక - 12

## లోపలి పేజీల్లో...

విద్యాహక్కు చట్టం + చైనా కంటే 3 రెట్లు.......... 5

మా పిల్లల పక్కన పేదల పిల్లల్ని కూర్చొబెట్టొద్దు!... 7

'కనెక్ట్' - ఎడ్యుకేషన్ మీట్............................. 8

'ఉపాధి, వికాసానికి ఒత్తిడి లేని చదువు' .......... 10

సంపన్నులపై సామాన్యులను ఉసిగొల్పి భారీ....... 13

ఫెడరల్ ఫ్రంట్ కన్నా ముందు నెరవేర్చాల్సిన ......... 20


జగన్ - చంద్రబాబు- మన పన్నుల డబ్బు............. 23

రాష్ట్రాలకు మరిన్ని అధికారాలనివ్వాలని............ 26

ఎత్తిపోతల విద్యుత్తు వ్యయం ఏడాదికి రూ......... 29

(మీడియాలో) 'కీ' కామెంట్లు ! ........................ 30

ప్రజలకు - పరిపాలనకు లింకు తెగిపోయింది.... 32





గడచిన ఐదేళ్లలో పదకొండు లక్షల కోట్లతో రోడ్లు వేశారట తెలుసా, ఈసారి పదిహేను లక్షల కోట్ల రూపాయలతో వేస్తారట...

## కార్టూన్ కార్నర్

### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్

ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# రారండోయ్..!


## 'ఎక్స్‌ప్లో ఎడ్యుకేషన్' టూర్‌కెళ్లద్దాం, జేపీతో కలిసి పనిచేద్దాం













మనదేశ గతంలోని ఘనతను గురించి మాట్లాడుకోవటం ఎంత అవసరమో తెలియదుగానీ, భవిష్యత్తులోని 90 శాతంపైగా జీవితాన్ని సొంతం చేసుకున్న ఘనమైన యువశక్తి గురించి ఆలోచించకపోతే మాత్రం భారత్ తీవ్రంగా నష్టపోతుంది. ఆలోచన, ఆత్మవిశ్వాసం, ఎటువంటి సవాళ్లు ఎదురైనా పరిష్కారంలో భాగమయ్యే యువతే ఈవేళ దేశ భవిష్యత్తుకు గ్యారంటీ! అందుకే గత 23 ఏళ్లుగా దాదాపు రెండున్నర లక్షలమందిని థాట్‌లీడర్స్‌గా తీర్చిదిద్దిన లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తాజా కొత్తతరాన్ని కూడా సామాజిక నాయకులుగా తీర్చిదిద్దేందుకు సంకల్పించారు. ఇందులో భాగంగానే 'ఓపెన్ అప్' కార్యక్రమానికి నాంది పలికారు.

యువతీయువకులు తమ కెరీర్‌ను, జీవితాల్ని చూసుకుంటూనే చుట్టూ ఉన్న సమాజంలోని సమస్యల్ని పరిష్కరించుకునేందుకు కావలసిన అవగాహనను, నైపుణ్యాల్ని ఓపెన్‌అప్ కార్యక్రమం అందిస్తుంది. ఏ రంగాలలో ఏ రకమైన మార్పులు వస్తే మనం, మన ఊరు, మన జిల్లా, మన రాష్ట్రం, మన దేశం ఆయురారోగ్యాలతో స్వేచ్ఛగా తలెత్తుకుని ఎదగగలుగుతాయో.. ఆ రంగాలలో ఆ రకమైన మార్పుల గురించి ఇందులో తెలియజేస్తారు, అవసరమైన శిక్షణనిస్తారు. ఓపెన్ అప్‌లో భాగంగా మొదట విద్యారంగాన్ని ఎంపిక చేశారు.

విద్యలో ఆచరణసాధ్యమైన సమూల మార్పుల గురించి యువత తెలుసుకుని, తమకు వీలైనట్లు రకరకాల రూపాల్లో పరిష్కారంలో భాగమయ్యేందుకు 'ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్'ను నిర్వహిస్తున్నారు. ఇదో పర్యటన. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని అత్యుత్తమ విద్యాసంస్థల్ని, విద్యావేత్తల్ని సందర్శించే పర్యటన. ఇందులో భాగంగా పరిశీలించటం, వినడం, చర్చించడం, స్పందించడం, తెలుసుకోవడం, నోట్సు రాసుకోవడం, నివేదిక తయారుచేయడం వంటివన్నీ ఉంటాయి. ఈ విలువైన యాత్ర సారాంశాన్ని ఇంకొన్ని కార్యక్రమాల సమాచారంతో సంధానం చేసి క్రమంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాల్లో భాగం చేసేందుకు జేపీ కృషి చేస్తారు.

ఈ మొత్తం కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రతినిధులు కూడా భాగస్వాములవుతారు. జేపీ మెంటార్‌గా వ్యవహరిస్తారు. కేవలం యువతకేనా? అని సమాజం పట్ల ఆర్తి ఉన్న కాస్త పెద్దవయస్కులు నిరుత్సాహపడనక్కర్లేదు. యువతకు ఎక్కువ ప్రాధాన్యతే ఉంటుందిగానీ, అన్ని వయసుల వారులూ ఈ యాత్రలో పాల్గొనవచ్చు.

జులై 22 నుంచి 31 వరకు ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్ టూర్‌లో పాల్గొనండి, జేపీతో కలిసి పనిచేయండి. ఎక్స్‌ప్లో ఎడ్యుకేషన్.. ద లెర్నింగ్ ఎక్స్‌పీడిషన్‌లో పేరు నమోదుకు ఆఖరి తేదీ జూన్ 25. వివరాలకు

www.fdrindia.org, www.twitter.com/jp_loksatta, www.facebook.com/jploksatta.




# విద్యాహక్కు చట్టం + చైనా కంటే 3 రెట్లు ఎక్కువ స్కూళ్లు.. అయినా పనికొచ్చే విద్యకు నోచుకోని కోట్లాది భవిష్యత్ భారత పౌరులు

విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) వచ్చి పదేళ్లు గడిచి పోయాయి.

పిల్లల్ని ప్రాథమిక పాఠశాలల్లో 100 శాతం ఎన్‌రోల్ చేయించాలన్న పాత దశాబ్దపు లక్ష్యాన్నే విజయవంతంగా సాధించటం మినహాయించి.. విద్యారంగంలో భారతదేశపు వైఫల్యాన్ని ఈ చట్టం సరిచేయలేకపోయింది, విద్యాప్రమాణాల్ని పెంచలేకపోయింది.

ప్రస్తుతం.. దేశంలో ఘనమైన విద్యాహక్కు చట్టం అమలవుతోందిగానీ, చదువుకున్న నిరుద్యోగుల సంఖ్యలో పెరుగుదల మాత్రం తగ్గటం లేదు. ఈ చట్టం వచ్చాక ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్లు ఇంకా పెరిగి, పలుచోట్ల ప్రమాణాలు ఇంకా తగ్గాయి. ఇటీవల నీతి ఆయోగ్ విడుదల చేసిన అధ్యయనం కూడా ఇదే అంశాల్ని ప్రస్తావించింది.

విద్యార్థులు లేని ప్రభుత్వ స్కూళ్లు పెద్దసంఖ్యలో ఉండటం ఒక సమస్యకాగా, విద్యార్థులున్నచోట ఉపాధ్యాయుల కొరత మరో సమస్యగా ఉంది. పాఠ్యాంశాలు, బోధనా ప్రమాణాలు-పద్ధతులు, విద్యార్థుల వికాసాన్ని అంచనా వేసే రీతిలో ఆహ్లాదకరమైన పరీక్షలు వంటివి అన్నిటి కంటే పెద్ద సమస్యగా ఉన్నాయి.

**స్కూళ్లు ఎక్కువ.. చదువు తక్కువ**

మనదేశంలో పిల్లలందర్నీ స్కూళ్లలో చేర్చేయటమనే ఏకైక లక్ష్యాన్ని మాత్రమే ఏళ్ల తరబడి కొనసాగించడం వల్ల జనావాసాలున్న ప్రతి చోటా స్కూళ్లను నిర్మించారు. దీంతో జనాభా, వనరులు తక్కువ ఉన్న చోట కూడా పాఠశాలలు ఏర్పడ్డాయి. జనాభాలో మనకంటే ఎక్కువగా, విద్యలో మనకంటే ఎంతో మెరుగ్గా ఉన్న చైనాలో కంటే కూడా.. మన వద్ద 3-4 రెట్లు ఎక్కువ సంఖ్యలో స్కూళ్లు ఉన్నాయి. మనదేశంలో 15 లక్షల పాఠశాలలుంటే, చైనాలో సుమారు 5 లక్షల స్కూళ్లు ఉన్నాయి. మనదేశంలోని దాదాపు 4 లక్షల స్కూళ్లలో ఒక్కోదాంట్లో 50 కంటే తక్కువ మంది విద్యార్థులు, గరిష్ఠంగా ఇద్దరు టీచర్లు ఉన్నారు. ఇలా మనదేశంలో దాదాపు 1 కోటీ 50 లక్షల మంది పిల్లలు అసంబద్ధమైన రీతిలో కొనసాగుతున్న పాఠశాలల్లో చదువుతున్నారు.

మరోవైపు, దేశంలో 10 లక్షల మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. ఉన్న ఉపాధ్యాయులకు కూడా హేతుబద్ధతలేని రీతిలో విధులను అప్పగించారు.

పట్టణాల్లో పలు చోట్ల ఉపాధ్యాయులు అవసరానికంటే ఎక్కువమంది ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 100 మందికి పైగా విద్యార్థులకు ఒకే టీచర్ పాఠాలు చెబుతున్న

స్కూళ్లున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ఉపాధ్యాయుల కొరత 40 శాతానికిపైగా ఉందని నీతి ఆయోగ్ నివేదిక తెలిపింది. దీనికితోడు ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం వండటం, ప్రభుత్వ సర్వేలు, పాలనా, ఎన్నికల బాధ్యతల్ని నిర్వహించే పనులు కూడా చేయాల్సి వస్తోంది.

విద్యార్థులు, టీచర్ల నిష్పత్తిని సమతూకంలోకి తెచ్చే విధంగా స్కూళ్లను హేతుబద్ధీకరించిన చోట కొంతమేర అభ్యసన వాతావరణం మెరుగుపడుతున్నట్లు అధ్యయనంలో తేలింది. ఇలాంటి చోట పిల్లల చేరికలు కూడా బాగా జరుగుతున్నాయి.

విద్యాప్రమాణాల పెంపు అన్నిటికంటే పెద్ద సవాలుగా ఉంది. విద్యార్థికి సరైన విద్య అందనప్పుడు.. ఇక మిగిలిన విషయాల గురించి ఏం మాట్లాడుకుని ఏం ప్రయోజనం? 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సగం మందికిపైగా 2వ తరగతి పాఠ్యపుస్తకాన్ని చదవలేకపోతున్నారని 'అసర్' తాజా సర్వేలో సైతం తేలింది. 1వ తరగతి చదువుతున్నవారిలో కేవలం 30 శాతం మంది మాత్రమే 12వ తరగతి పట్టా తీసుకుంటున్నారని, వీరిలో కూడా అత్యధికులకు వెంటనే ఉద్యోగావకాశానికి తగిన నైపుణ్యాలు లేవని తెలిపింది. టీచర్లకు కూడా పాఠ్య పుస్తకాలలోని అంశాలపై విషయ పరిజ్ఞానం సరిగా ఉండటం లేదు. వాటిని బోధించే సామర్థ్యం కొరవడుతోంది. పాఠ్యాంశాల ప్రాసంగికత కూడా ప్రశ్నార్థకంగా ఉంది. ముఖ్యంగా ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో!

**రాజకీయ సంకల్పం, సమగ్ర ప్రణాళిక ఉంటేనే..**

ఉపన్యాసాలతోనో, నినాదాలతోనో, ఆకాంక్షలతోనో విద్యా ప్రమాణాల పెంపు సాధ్యం కాదు. విద్య పట్ల గౌరవంతోపాటు విద్య విలువను అర్థం చేసుకుని, విద్యలో 'సక్సెస్'కి కొత్త నిర్వచనాన్నిచ్చి.. ఒక రాజీలేని సంకల్పంతో, సమగ్ర ప్రణాళికతో చర్యలు ప్రారంభిస్తేనే ప్రతి బిడ్డకూ మంచి చదువు, ఉజ్వల భవిత అందుబాటులోకి వస్తాయి.

సిలబస్‌ను పూర్తి చేయటంకాకుండా, విద్యార్థుల అభ్యసన స్థాయిని అంచనా వేయటం మీద దృష్టి కేంద్రీకరించేలా బోధనా పద్ధతుల్ని మార్చాలి. గ్రేడ్ల ఆధారంగా కాకుండా.. విద్యార్థుల సామర్థ్యానికనుగుణంగా బోధన ఉండేలా చేయాలి.

భిన్నాలను కలిపేటప్పుడు, ఉమ్మడి డినామినేటర్ ఎందుకు ఉండాలి.. వంటివి నిత్యజీవితంలోని ఉదాహరణల ఆధారంగా ఉపాధ్యాయుడు పిల్లలకు చెప్పగలగాలి.

అలాగే వృత్తి విద్యను పూర్తిగా ఆధునీకరించాలి. ప్రస్తుతం దాదాపు 8,000 స్కూళ్లలో సెకండరీ స్థాయిలో వృత్తి విద్యను బోధిస్తున్నారు. అయితే ఈ ట్రేడ్లు ఇప్పుడు కాలం చెల్లినవిగా మారాయి. వీటన్నిటినీ నూతన ఉపాధి అవకాశాలకనుగుణంగా ఆధునీకరించాలి.

విద్యా పరిశోధన, శిక్షణకు సంబంధించి రాష్ట్ర, జిల్లా స్థాయి సంస్థలను బలోపేతం చేసి, అర్హులను అందులో నియమించాలి. పాఠశాలల్లో విద్యాప్రమాణాలు ఎలా ఉన్నాయో బేరీజు వేసే, పర్యవేక్షించే యంత్రాంగమే పైస్థాయిలో కరువైంది. ఈలోపాలన్నిటినీ సరిచేస్తూ పాఠశాల్లో విద్య, పని సంస్కృతులను పెంపొందించాలి. ఉపాధ్యాయులు విధులకు కచ్చితంగా హాజరయ్యేలా, సరైన ప్రమాణాలతో బోధన చేసేలా పర్యవేక్షణ ఉండాలి.

ఉన్న బడ్జెట్‌లోనే నాణ్యమైన విద్యను అందించటానికి సమూలంగా ఈ చర్యల్ని తీసుకోవటానికి రాజకీయ సంకల్పంతోపాటు, అధికార యంత్రాంగం, ప్రైవేటు రంగం, పౌర సమాజం కూడా కలిసికట్టుగా పనిచేయాలి.

విద్యాహక్కు చట్టం ఎన్నో లోపాలతో యథాతథ స్థితిని కొనసాగిస్తూ కొన్ని తరాల భవిష్యత్తుతో, దేశాభివృద్ధితో చెలగాటమాడుతున్నా కూడా నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఇంతవరకూ దీన్ని బాగు చేసేందుకు చర్యలు తీసుకోలేదు. పెద్ద నోట్ల రద్దు వంటి పెను నిర్ణయాన్ని, తమకు ఓట్లు పడేలా ఉద్వేగాలను రెచ్చగొడతాయనుకున్న అంశాలను రాత్రికి రాత్రి అమల్లోకి తెచ్చిన, పార్లమెంటులో ఆమోదింప చేసిన మోదీ.. దేశాభివృద్ధికి మూలస్తంభమైన విద్యను మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఓవైపు సహకార సమాఖ్య వ్యవస్థ అంటూనే.. విద్యాహక్కు చట్టంలోని లోపాల్ని సరిచేసుకోవటానికి రాష్ట్రాలకు అధికారం లేకుండా చేతులు కట్టేశారు. అందుకే ఆర్‌టీఈలో సవరణలు సహా విద్యారంగంలో చేపట్టాల్సిన నిర్దిష్ట చర్యలను ప్రతిపాదించి ప్రభుత్వాలు, ప్రజల ముందుంచటంతో పాటు.. విద్య, ఆరోగ్యం వంటి ప్రధాన రంగాలలో మౌలిక మార్పులకు రాష్ట్రాలు వేగంగా చర్యలు తీసుకునేందుకు వీలుగా ఫెడరలిజాన్ని బలోపేతం చేసేందుకు కూడా లోక్‌సత్తా పార్టీలకతీతంగా కృషి చేస్తోంది. □

# మా పిల్లల పక్కన పేదల పిల్లల్ని కూర్చోబెట్టొద్దు!




ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించకుండా కుట్ర పన్నినట్టు రాజకీయ వ్యవస్థ, సమాజంలోని కొన్ని వర్గాలు వ్యవహరిస్తుండబట్టే.. స్వతంత్రం వచ్చి డెబ్భై ఏళ్లు దాటినా మనదేశంలో విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయని లోక్‌సత్తా చాన్నాళ్లుగా ఆరోపిస్తోంది.

''సమాజంలో విద్యకున్న డిమాండ్‌ను ఓట్లుగా మలచుకోవడానికి పాలకులు పేరుకి ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత చదువును అందిస్తున్నా, వాటిల్లో చాలాచోట్ల నాణ్యమైన చదువును అందించటం లేదు. మరోవైపు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు ఆయా కులాల్లోని నిజమైన పేదలకు అందేలా చర్యలు లేవు. రిజర్వేషన్ల పరిధిలోని ప్రజలు– రిజర్వేషన్లకు బైటున్న ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా, కులవివక్ష అగాధం ఇంకా పెరిగేలా వాటిని అమలుచేస్తున్నారు. లంచాలు గుంజటానికి వీలైనరీతిలో ప్రయివేటు రంగంపై అసంబద్ధ లైసెన్స్‌రాజ్ ఆంక్షల్ని విధిస్తున్నారు. యూపీయే ప్రభుత్వం విద్యాహక్కు చట్టం వంటి డ్రామాలాడితే, ప్రస్తుత ప్రభుత్వం ఐదేళ్ల అధికారాన్ని పూర్తి చేసుకుని రెండోసారి ఎన్నికైనా ఆ చట్టంలోని లోపాలను సరిచేయలేదు" అని లోక్‌సత్తా పలు సందర్భాలలో విమర్శలు చేసింది.

లోక్‌సత్తా విమర్శలను ఇటీవల ఓ అధ్యయనం కూడా పరోక్షంగా బలపరిచింది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రయివేటు విద్యాసంస్థల్లో పేదలకు 25 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం కల్పిస్తున్నా.. అవి నిజంగా అర్హులకు అందటం లేదని తెలిపింది. రిజర్వేషన్లలో సంస్కరణలు కొరవడటం, అందరికీ నాణ్యమైన విద్యను అందించటంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏర్పడిన సంక్లిష్ట పరిస్థితులకు కూడా ఈ చట్టం అమలు అద్దం పడుతోందని వెల్లడించింది.

"పేదింటి పిల్లలకు ఆ విద్యాసంస్థల్లో సీట్లు కోటాగా ఇవ్వడంపై ఎగువ మధ్యతరగతి, సంపన్న వర్గాల వారు అభ్యంతరం తెలుపుతున్నారు. తమ పిల్లలు పేదవారితో కలిసి ఉండటాన్ని వారు ఇష్టపడటం లేదు. మరోవైపు, రిజర్వేషన్ల విధానాన్ని ఉపయోగించుకుని బడుగువర్గాల్లోని స్థితిమంతులు మాత్రం మిగతా చోట్లలాగానే కిందివారికి దక్కాల్సిన రిజర్వేషన్ల ప్రయోజనాన్ని వారు సొంతం చేసుకుంటున్నారు. సొమ్ములు ఖర్చు చేసి కోర్టుకు వెళ్లయినా సీట్లు పొందుతున్నారు. ఇంకోవైపు, రిజర్వేషన్ల కోటాలో ఇచ్చే సీట్లకు ప్రభుత్వం రాయితీలు ఇస్తున్నా, ఆ సొమ్ము పాఠశాలలు వసూలు చేసే బోధన రుసుముకు సరిపోవడం లేదు. అదనపు ఖర్చులను భరించడానికి పాఠశాలలు బోధన రుసుములను పెంచుతుండటంతో మధ్యతరగతి తల్లిదండ్రులు అభ్యంతరం తెలుపుతున్నారు. ప్రయివేటు పాఠశాలల్లో రిజర్వేషన్ వ్యవహారం వ్యక్తిగత సమస్యలా కనిపిస్తున్నా, అందులో పలు సంక్లిష్ట అంశాలున్నాయి" అని ఈ అధ్యయనాన్ని వెలువరించిన ప్రపంచ బ్యాంకు తెలిపింది. 2010 నుంచి ఈ చట్టం అమల్లోకి రాగా, గతేడాది వరకు ఏకంగా 41,342 కేసులు దాఖలయ్యాయని, ఇందులో 2,477 కేసులు సుప్రీంకోర్టు పరిశీలనకు వెళ్లాయని వెల్లడించింది.

లోక్‌సత్తా తొలి నుంచీ డిమాండ్ చేస్తున్నట్టు.. తల్లిదండ్రులకు జేబులో నుంచి రూపాయి ఖర్చులేకుండా అందరికీ ప్రపంచస్థాయి పాఠశాల విద్యను ప్రభుత్వమే అందిస్తే, ప్రపంచబ్యాంకు అధ్యయనం ధృవీకరించిన అనేక సమస్యలు తొలగిపోతాయి. రిజర్వేషన్ల అవసరం లేకుండానే పేద, అణగారిన వర్గాల పిల్లలు హక్కుగా వెళ్లి తమకు నచ్చిన మంచి స్కూల్‌లో చదువుకోగలుగుతారు, తమలోని ప్రతిభను వికసింపచేసుకోగలుగుతారు. కులవివక్షను రూపుమాపగలుగుతారు. □

# 'కనెక్ట్' - ఎడ్యుకేషన్ మీట్..
# పాఠశాలల ప్రమాణాలను పరీక్షించేందుకు
# స్వతంత్ర ప్రతిపత్తి గల టెస్టింగ్ బోర్డు ఏర్పాటుకు నిర్ణయం

**- ఉప్పలపాటి మాచిరాజు,** లోక్‌సత్తా, ఆంధ్రప్రదేశ్

Interdependence is more effective than Independence

**CONNECT**

**Education Meet**

(Collaboration Of NGOs & NPOs for Education and Community Transformation)




విద్యను రాజకీయానికి, సమాజానికి కేంద్రబిందువు చేసేందుకు కృషి చేస్తున్న ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్)/ లోక్‌సత్తా ఆధ్వర్యంలో 'ప్రామాణిక విద్యను బడి ఈడు పిల్లలందరికీ అందించటం' లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు స్వచ్ఛంద సంస్థలు, స్కూళ్ల ప్రతినిధులు, ఔత్సాహికుల సమావేశం ఇటీవల హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని 'అహం లెర్నింగ్ సంస్థ'లో జరిగింది.

'కనెక్ట్' పేరుతో జరిగిన ఈ విద్యా సమావేశంలో పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు.

కనెక్ట్ చర్చించిన ఎజెండా:

1. వివిధ జాతీయ, అంతర్జాతీయ సర్వేలు, క్షేత్రస్థాయి వాస్తవాలు
2. పరీక్షా విధానం, చూచి వ్రాత వంటి పెడధోరణులు
3. ఎలాగయినా పాస్ చెయ్యడం లక్ష్యంగా పేపర్ల తయారీ, పరీక్ష పేపర్లు దిద్దే విధానం
4. టీచర్ల జవాబుదారీతనం, అర్థవంతమైన పర్యక్షణా వ్యవస్థ
5. తల్లిదండ్రులు, సమాజం పాత్ర
6. కరిక్యులం, అవసరమైన మార్పులు
7. పిల్లలు– లైంగిక వేధింపులు
8. బాలల హక్కుల సంఘాల ఆవశ్యకత

వీటన్నిటిపై చర్చించిన అనంతరం ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ, పాఠశాలల్లో ప్రమాణాలను పరీక్షించటానికి ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల బోర్డును ఏర్పాటు చేద్దామని ప్రతిపాదించారు. అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాల మధ్య చేస్తున్న 'పీసా' సర్వే కంటే కొంత తక్కువగా, ఇప్పుడు దేశీయంగా చేస్తున్న 'అసర్' సర్వే కంటే ఎక్కువగా ప్రమాణాలు ఉండేలా టెస్టింగ్ బోర్డు సర్వే ప్రాతిపదికలు ఉండాలని సూచించారు.

దేశంలోని విద్యాప్రమాణాలపై ఏటా సర్వే చేస్తూ వివరాల్ని అందిస్తున్న అసర్ ప్రశ్నావళి సరిపోదని, అదేసమయంలో పీసా సర్వే మన సాంస్కృతిక నేపథ్యానికి కొంత భిన్నంగా ఉంటుందని జేపీ అన్నారు. పీసాలోని కొన్ని గీటురాళ్లను ఉపయోగించు కుంటూ, అసర్‌లోని కొన్ని అంశాలను కొనసాగిస్తూ కొత్తగా స్కూళ్ల సర్వే ప్రశ్నావళిని రూపొందిద్దామన్నారు. మోసాలు, అవకతవకలకు ఆస్కారం లేకుండా ర్యాండమ్ ప్రశ్నాపత్రాల పద్ధతిని అనుసరిద్దామన్నారు. సర్వే ఫలితాల్ని ప్రచురించటం తప్పనిసరేమీ కాదని, సర్వేలో పాల్గొన్న స్కూలే దాన్ని వెల్లడించవచ్చని అన్నారు. అద్భుత పరిజ్ఞానాన్ని పరీక్షించటం కోసం కాకుండా విద్యార్థులకు హేతుబద్ధమైన, పనికొచ్చే రీతిలో పరిజ్ఞానం లక్ష్యంగా టెస్టింగ్ బోర్డు ఏర్పాటు ఉండాలని జేపీ కోరారు. దీనిపై కార్యాచరణను వెంటనే ప్రారంభించాలని లోక్‌సత్తా బాధ్యులను ఆదేశించారు.

ప్రపంచంలోని అన్ని దేశాల్లో కంటే మనదేశంలో పిల్లల చదువుల పట్ల తల్లిదండ్రులకు ఎక్కువ ఆర్తి ఉందని, కానీ దాన్ని బాగు చేసే శ్రద్ధ ప్రభుత్వాలకు లేదని జేపీ అన్నారు.



తాము తినీతినక పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు డబ్బును వెచ్చిస్తున్నారన్నారు. భారత్‌లో విద్యను నాశనం చేస్తున్న ప్రభుత్వాల నుంచి తమకు పోటీ, సమస్యలు రావనే ప్రైవేటు పెట్టుబడిదారులు విద్యావ్యాపారానికి ముందుకొస్తున్నారన్నారు.

లివింగ్ విద్యా వికాసవనం నుంచి వచ్చిన డాక్టర్ ఎస్ఆర్ పరిమి మాట్లాడుతూ, ప్రధానోపాధ్యాయుల నియామకంలో వారి నాయకత్వ లక్షణాలు, పరిపాలన, నిర్వహణా దక్షతను పట్టించుకోకపోవటం వల్ల విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతోందన్నారు. పిల్లలకు సరిగ్గా చదవటం నేర్పిస్తే దాన్ననుసరించి అన్నీ వచ్చేస్తాయన్నారు.


విద్యావ్యవస్థను బాగుచేసే పరిష్కారాల్ని సమష్టిగా సాధిద్దామని, మరిన్ని సంస్థలు కూడా కలిసి పనిచేయటానికి ముందుకొస్తున్నాయని జేపీ తెలిపారు. పాఠశాలల నాణ్యతా ప్రమాణాల టెస్టింగ్‌ను ముందు తెలుగు రాష్ట్రాల్లో ఎంపిక చేసిప బడులలో ప్రారంభిద్దామని, క్రమంగా అన్ని స్కూళ్లకూ విస్తరిద్దామని సూచించారు.

కనెక్ట్ తొలి సమావేశానికి హాజరైన సంస్థలు, ప్రతినిధులు:

పడాల చారిటబుల్ ట్రస్ట్ నుంచి పడాల సూర్యప్రసాద్, ఏవీఎస్‌వీ దీప్తి, డాక్టర్ గణపతిరావు, వంశీ, రవితేజ, లివింగ్ విద్యా వికాసవనం నుంచి డాక్టర్ ఎస్ఆర్ పరిమి, డాక్టర్ హేమ పరిమి, వందేమాతరం ఫౌండేషన్ నుంచి వై. మాధవరెడ్డి, వనితా రూపాని (టీచ్ ఫర్ ఇండియా), డాక్టర్ బీఎల్ సునీత (ప్రథమ్), కె. శివశంకర్, ఎస్. శ్రీనివాసరావు (ఏఎస్‌డబ్ల్యుఏ), కె. సత్తిరాజు (యూటీఎఫ్), పి. సుబ్బరాజు (ఎస్‌టీయూ), బుద్దా శ్రీనివాస్ (జేవీవీ), డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆశ్రమ్ మెడికల్ కాలేజీ), డాక్టర్ సీఏ ప్రసాద్ (ప్రజా సైన్సు వేదిక), శ్రీనివాసరావు (గౌ ఫౌండేషన్), డాక్టర్ ఎం. ఉపేంద్రరెడ్డి (ప్రొఫెసర్ ఎస్‌సీఈఆర్‌టి), చరిత మండ (కస్తూరి మాగజైన్), జె. కిరణ్‌కుమార్ (ప్రైవేట్ స్కూల్స్), కె. శాంతారావు (వనమాడి కల్చరల్ రిసోర్స్ సెంటర్), సీఎల్‌జీ నాద్ (క్విక్కర్ లెర్నింగ్ ఎఫ్‌బీ గ్రూప్), చిత్ర భాను (మహిరుహం), నిసార్ ఫాతిమా (ఎఫ్‌డీఆర్ ప్రోగ్రాం మేనేజర్, ఆర్ అండ్ ఏ డివిజన్), గాయత్రీ మేకా (ఎఫ్‌డీఆర్), ప్రితి బన్సాల్ (ఎఫ్‌డీఆర్), ఆయుష్ కొతిఫెర్రా (ఎఫ్‌డీఆర్/ఐఐటీ రూర్కీ), రోహన్ అత్రావాల్కర్ (ఎఫ్‌డీఆర్/టిస్–హైదరాబాద్), మేఘన (ఎఫ్‌డీఆర్), రాజశేఖర్ ఏ (ఏపీ మోడల్ స్కూల్), ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, తోట రాంబాబు (క్రియ), అజిత (అహం లెర్నింగ్), సుమన్ పి (ఎడోబ్ మాంటిసోరీ), టి. నిర్మల, కనకదుర్గ వెంపటి, మహేశ్వరి జి, సుధీర్ వీహెచ్ (టీచర్), ఆర్. అనంత జనార్ధన్ (మల్లారెడ్డి మెమోరియల్ స్కూల్), ఎల్‌వీవీ, అభ్యాస, ఏకలవ్య ఫౌండేషన్. ◻

# 'ఉపాధి, వికాసానికి ఒత్తిడి లేని చదువు' లక్ష్యంగా..

**జాతీయ నూతన విద్యావిధానం 2019 ముసాయిదా.. ఈ నెలాఖరు వరకు అభిప్రాయాలు పంపొచ్చు**




నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) రూపకల్పనకు 2017లో ఇస్రో మాజీ చీఫ్ కస్తూరి రంగన్ నేతృత్వంలో 9 మందితో ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఇటీవల 484 పేజీల తన నివేదికను కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి రమేష్ పొఖ్రియాల్‌కు అందజేసింది. నివేదిక రూపకల్పన సమయంలో ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్-ఎఫ్‌డీఆర్)/లోక్‌సత్తా తరపున డా॥ జయప్రకాష్ నారాయణ్ ఈ కమిటీతో సమావేశమై చర్చించటంతోపాటు, సూచనలిస్తూ వచ్చారు. ఎఫ్‌డీఆర్ తరపున లిఖితపూర్వకంగా కూడా ప్రతిపాదనల్ని అందజేశారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఇతర అంశాల చుట్టూ కాకుండా.. విద్యార్థుల చుట్టూ, వారిలో ప్రమాణాలను పెంచటం చుట్టూ విద్యావ్యవస్థను నిర్మించటంపై జేపీ ప్రధానంగా దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా.. తర్కం, విశ్లేషణ, సృజనాత్మక సామర్థ్యాల్ని పెంపొందిస్తూ పిల్లల మీద భారం లేకుండా వికసింపచేసే బోధన, అభ్యసన సామర్థ్యాల పరీక్షకు ఆహ్లాదకర పద్ధతులు, విద్యేతర కార్యక్రమాల్నీ చదువులో భాగం చేయటం, ఎక్కువ భాషల్ని నేర్చుకునేలా ప్రోత్సహించటం, ప్రపంచంలో ఎక్కడికెళ్లినా సంక్లిష్ట పరిస్థితుల్ని అధిగమిస్తూ తలెత్తుకుని బతకగలిగే సాంప్రదాయేతర సామర్థ్యాన్ని పెంపొందించటం ప్రధాన లక్ష్యాలుగా నూతన విద్యావిధానం రూపకల్పనకు జేపీ కృషి చేశారు. విద్యావ్యవస్థలో దాదాపు 19 మార్పుల్ని సూచించిన కస్తూరి రంగన్ కమిటీ నివేదికను జాతీయ నూతన విద్యావిధానం-2019 ముసాయిదా విధానంగా కేంద్ర ప్రభుత్వం వెబ్‌సైట్‌లో ఉంచింది. దీనిపై ప్రజలు తమ సలహాసూచనల్ని జూన్ 30లోగా nep.edu@nic.in కి పంపవచ్చు.

**నూతన జాతీయ విద్యావిధానం 2019 ముసాయిదా లోని ముఖ్యాంశాలు:**

- విద్యను లాభాపేక్ష రహితంగా చూడాలి. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలను సమానంగా పరిగణించాలి.
- ప్రస్తుత అవసరాలు, ఉపాధి కల్పనకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేసేలా విద్యావ్యవస్థ ఉండాలి.
- దేశవ్యాప్తంగా పాఠశాల విద్యలో ఏకరూపత తీసుకురావాలి.
- ఉన్నత విద్యను అంతర్జాతీయం చేయాలి. ఓపెన్, డిస్టెన్స్ విద్యను మరింత మెరుగుపరచాలి.
- దేశవ్యాప్తంగా పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని 1:30కి తగ్గించాలి.
- స్థానిక భాషల పుస్తకాలతో ప్రతి పాఠశాలకు ఒక గ్రంథాలయం ఏర్పాటు చేయాలి.
- విద్యావకాశాల్లో లైంగిక, సామాజిక, ప్రాంతీయ అసమానతలను తొలగించాలి.
- కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (ఎంహెచ్ఆర్డీ)ని కేంద్ర విద్యాశాఖగా మార్పు చేయాలి.

**పాఠశాల విద్యలో ఇవీ మార్పులు :**

- శిశు విద్య నుంచి 12వ తరగతి (ఇంటర్) వరకు పాఠశాల విద్యగా పరిగణిస్తారు. అంటే 3 సంవత్సరాలు పూర్తయిన పిల్లలు బడుల్లో చేరవచ్చు. ఆ మేరకు విద్యాహక్కు చట్టాన్ని విస్తరిస్తారు. అంటే ఇక భవిష్యత్తులో అంగన్‌వాడీ కేంద్రాల్ని కూడా విద్యాశాఖలో భాగంగా చూస్తారు.
- ఇప్పటి వరకు ఉన్న 10+2 పాఠశాల విద్యా నిర్మాణం స్థానంలో 5+3+3, 4 అనే నాలుగు విభాగాలను చేరుస్తారు. 3-8 సంవత్సరాల మధ్య పిల్లలకు శిశు విద్యతోపాటు 1, 2 తరగతులు, 8-11 ఏళ్ల మధ్య వయసు పిల్లలకు 3, 4, 5 తరగతులు, 11-14 ఏళ్ల మధ్య 6, 7, 8 తరగతులు, 14-18 ఏళ్ల మధ్య వయసున్నవారికి 9, 10, 11, 12 తరగతుల విధానం ఉంటుంది. శిశు విద్య నుంచి 12వ తరగతి మొత్తం పాఠశాల విద్యలో భాగంగా ఉంటుంది. అంటే జూనియర్ కళాశాలల వ్యవస్థ ఉండదు.
- 8వ తరగతి వరకు మాతృభాషలో చదువుకోవాలి. కనీసం 5వ తరగతి వరకు తప్పనిసరి. 3-8 వయసు వరకు పిల్లలు

వివిధ భాషలు సులువుగా నేర్చుకుంటారు. అందుకే వారికి మూడు భాషలను పరిచయం చేస్తారు. దానివల్ల వారు గలగలా మాట్లాడటానికి వీలవుతుంది.

- హిందీయేతర రాష్ట్రాలలో ఆరవ తరగతి నుంచి ప్రాంతీయ భాష, ఇంగ్లీషుతోపాటు హిందీని తప్పనిసరిగా అభ్యసించాలి అనే నిబంధన తొలుత ముసాయిదాలో ఉన్నప్పటికీ.. తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు రావటంతో దాన్ని మార్చారు. "భాషల ఎంపికలో వెసులుబాటు" అనే శీర్షిక కింద ముసాయిదాలో ఆ సవరణను చేర్చారు. "తాము అభ్యసించాల్సిన మూడు భాషల్లో మార్పులు చేసుకోవడానికి ఆరు లేదా ఏడో తరగతిలో వీలుంటుంది" అని పేర్కొన్నారు. అయితే విద్యార్థులు మాధ్యమిక పాఠశాల స్థాయిలో నిర్వహించే బోర్డు పరీక్షల్లో ఏవైనా మూడు భాషల్లో (ఒకటి సాహిత్య స్థాయి) తమ ప్రావీణ్యాన్ని తప్పనిసరిగా ప్రదర్శించాల్సి ఉంటుందని ముసాయిదా విధానం స్పష్టం చేసింది. ప్రాథమిక అంశాల ఆధారంగానే భాషా నైపుణ్యాల్ని ప్రదర్శిస్తారు కాబట్టి నాలుగేళ్లలో నైపుణ్యాన్ని సాధించవచ్చు, అందువల్ల ఆరో తరగతిలో భాషను మార్చుకోవడం వీలవుతుంది అని పేర్కొంది.
- అవగాహన పెంచుకునేందుకు 9-12 తరగతి విద్యార్థులందరికీ కరెంట్ అఫైర్స్ కూడా పాఠ్యప్రణాళికలో ఉంటుంది.
- ప్రతి విద్యార్థిలో శాస్త్రీయ దృక్పథం పెంచేలా చదువు ఉంటుంది. నైతిక భావాలు, తార్కిక పరిశీలన, సాంఘిక, భావోద్వేగపరమైన అంశాలు, కమ్యూనికేషన్, నైతికత, డిజిటల్ విద్య, భారత్‌పై పరిజ్ఞానం, దేశంలోని ముఖ్యమైన సమస్యలను తెలుసుకునేలా సిలబస్ రూపొందిస్తారు.
- **పునాదులపై గట్టి దృష్టి :** విద్యార్థులు ఐదో తరగతికి వచ్చేసరికి పునాది గట్టిగా వేయాలని కమిటీ సూచించింది. ప్రస్తుతం తీవ్ర అభ్యసన సంక్షోభం పట్టి పీడిస్తోందని, ఎలిమెంటరీ విద్యలో ఐదు కోట్ల మంది ప్రారంభ విద్య, లెక్కలు నేర్చుకోలేకపోతున్నారని అభిప్రాయపడింది.
- **సెమిస్టర్ల పద్ధతి, నచ్చినప్పుడు రాసుకోవచ్చు:** 8వ తరగతి నుంచి ప్రతి ఏడాదిని రెండు సెమిస్టర్లుగా విభజిస్తారు. అంటే, మొత్తం ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ప్రతి విద్యార్థి ప్రతి సెమిస్టర్‌కు ఐదు నుంచి ఆరు సబ్జెక్టులను ఎంపిక చేసుకోవాలి. అందరికీ కొన్ని కామన్ సబ్జెక్టులు ఉంటాయి. సబ్జెక్టులను ఎంపిక చేసుకోవటంలో విద్యార్థులకు స్వేచ్ఛ ఉంటుంది. ఒక తరగతిలో ఏ సెమిస్టర్‌లోనైనా సంబంధిత సబ్జెక్టులను తమ ఇష్టం వచ్చినప్పుడు రాసుకునే అవకాశం ఇవ్వాలని కమిటీ సూచించింది. రెండుసార్లు పరీక్షలు రాసుకునే అవకాశం ఇవ్వాలని ప్రతిపాదించింది.
- పాఠశాల నుంచి ఉన్నత విద్య వరకు సంస్కృతం ఒక ఐచ్ఛిక సబ్జెక్ట్‌గా ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు చదువుకోవచ్చు.
- మారుతున్న పరిస్థితుల్లో విదేశీ భాషలకు ప్రాధాన్యం పెరుగుతుంది. గతంలో మాదిరిగానే త్రిభాషా సూత్రం అమల్లో ఉంటుంది. అనర్గళంగా మాట్లాడేలా, వ్యవహారాలు నడుపుకునేలా, ఉన్నత విద్యలో అధ్యయనానికి ఉపయోగపడేలా స్కూళ్లలో నాణ్యమైన ఇంగ్లీషు బోధన ఉండాలి.
- వివిధ సబ్జెక్టులపై ఒలింపియాడ్, ఇతర పోటీ పరీక్షలను మరింత ప్రోత్సహిస్తారు. అంతర్జాతీయ ఒలింపియాడ్లలో పాల్గొనేందుకు కేంద్రం నిధులిస్తుంది.
- **ఆటలూ చదువులో భాగమే:** ఇకపై కరిక్యులర్, కో కరిక్యులర్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ అనే తేడాలు ఏమీ ఉండవు. ఆటలు, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, స్పోర్ట్స్, యోగా, కమ్యూనిటీ సర్వీస్ తదితరాలన్నిటినీ పాఠ్యప్రణాళికలో భాగం చేస్తారు.
- **టీచర్లకు డిగ్రీ తప్పనిసరి.. బీఈడీ ఇక నాలుగేళ్లు:** ఇకపై టీచర్లకు కనీస అర్హతగా డిగ్రీ ఉండాల్సిందే. బీఈడీ కూడా నాలుగేళ్లు చదవాలి. ఈ ప్రమాణాలు లేని ఉపాధ్యాయ విద్యాసంస్థలను మూసివేస్తారు. 2030 నుంచి నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సులు అందుబాటులోకి తీసుకురావాలని, ఈ కోర్సులను డిగ్రీ, పీజీ కోర్సులు నిర్వహించే కళాశాలల్లోనే బోధించాలని కమిటీ పేర్కొంది. రెండేళ్ల బీఈడీ కోర్సును ఏడాది కోర్సుగా మార్చి, నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు చేసినవారికి ప్రవేశాలు కల్పిస్తారు. ఉపాధ్యాయ వృత్తిలోకి అత్యంత ప్రతిభావంతులైనవారికే ప్రవేశం కలిగేలా చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో కేవలం రాతపరీక్ష మార్కులకే ప్రాధాన్యముంది. టెట్‌లో ప్రతి అభ్యర్థి 5 నుంచి ఏడు నిమిషాల పాటు ప్రత్యక్ష తరగతుల డెమోకు హాజరుకావాలని ప్రతిపాదించింది. గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించేందుకు భారీస్థాయిలో ఉపకార వేతనాలు అందించాలని సూచించింది. ఇక 'ప్రైవేటు పాఠశాల' అనే పదాన్ని ఉపయోగించకూడదు. 'ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ సహాయం పొందుతున్నది' అని మాత్రమే వ్యవహరించాలి.


- **భారతీయ విజ్ఞాన వ్యవస్థలకు పెద్దపీట:** పాఠశాల పాఠ్య ప్రణాళికలో విజ్ఞానం, చరిత్రలో భారతీయ భాగస్వామ్యానికి చోటు కల్పించాలని కమిటీ సూచించింది. గణిత శాస్త్రం, ఖగోళ శాస్త్రం, తత్వ శాస్త్రం, మనస్తత్వ శాస్త్రం, యోగా, వాస్తు శాస్త్రం, వైద్య శాస్త్రంతోపాటు పాలనలో భారతీయుల భాగస్వామ్యాన్ని పాఠ్యప్రణాళికల్లో పేర్కొనాలని ప్రతిపాదించింది.
- ప్రైవేటు పాఠశాలలు రుసుములను నిర్ణయించుకోవచ్చు. కానీ ఏ పద్దు కింద అయినా ఇష్టారాజ్యంగా పెంచకూడదు. ద్రవ్యోల్బణం ఆధారంగా ప్రభుత్వ పరిశీలనకు నిలిచేలా న్యాయంగా ఫీజుల పెంపు ఉండాలి. ప్రతి మూడేళ్లకు వీటిని నియంత్రించేందుకు స్టేట్ స్కూల్ రెగ్యులేటరీ అథారిటీ (ఎస్ఎస్ఆర్ఏ) పేరిట ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని ముసాయిదా విధానంలో సూచించారు.

**ఉన్నత విద్యలో..**

- ఇక అనుబంధ కళాశాలలు ఉండవు. విశ్వవిద్యాలయాలు లేదా డిగ్రీ ఇచ్చే స్వయంప్రతిపత్తి హోదా ఉన్న కళాశాలలు మాత్రమే ఉంటాయి. అంటే ఇక ప్రతి కళాశాల స్వయంప్రతిపత్తివైపు అడుగులెయ్యాలి.
- **మిషన్ నలంద.. మిషన్ తక్షశిల:** ఉన్నత విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని కమిటీ ప్రతిపాదించింది. ఇందులో భాగంగా ఉన్నత విద్యాసంస్థలను మూడు రకాలుగా వర్గీకరిస్తారు. అండర్ గ్రాడ్యుయేట్ విద్యలో పరిశోధన, ఉన్నతస్థాయి బోధనకు పెద్దపీట వేస్తారు. మిషన్ నలంద, మిషన్ తక్షశిలలో భాగంగా ప్రపంచస్థాయి పరిశోధన, అన్ని స్థాయిల్లోనూ ఉన్నతస్థాయి బోధనపై దృష్టి కేంద్రీకరిస్తారు.
- **జాతీయ విద్యా కమిషన్ ఏర్పాటు:** రాష్ట్రీయ శిక్షా ఆయోగ్ లేదా జాతీయ విద్యాకమిషన్ (ఎన్ఈసీ) ఏర్పాటు చేయాలి. విద్యలోని బహుముఖ కోణాల మధ్య ఇది సమన్వయం సాధించాలి. ప్రధాని అధ్యక్షతన ఏర్పడే కమిషన్‌లో కేంద్ర విద్యాశాఖ మంత్రి వైస్ ఛైర్‌పర్సన్‌గా ఉంటారు. "సుదీర్ఘకాలం కొనసాగేలా, ఎప్పటికప్పుడు మార్పులు చేసుకునేలా దేశంలో విద్యావ్యవస్థను అభివృద్ధి చేయడం, రూపొందించడం.. అమలు చేయడం, మదింపు చేయడం మరియు సవరించడం దీని బాధ్యత. ఈ విజన్‌ను సాధించడానికి సంస్థాగత విధి విధానాలను రూపొందించడం, పర్యవేక్షించడం దీని బాధ్యతే" అని ముసాయిదాలో పేర్కొన్నారు. ఎన్ఈసీలో 20–30 మంది సభ్యులుంటారు. వీరిలో విద్యావేత్తలు, పరిశోధకులు, ఆర్ట్స్, బిజినెస్, ఆరోగ్యం, వ్యవసాయం, సామాజిక సేవ వంటి వివిధ రంగాల్లో నిపుణులు సగం మంది ఉంటారు. కేంద్ర మంత్రులు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్, ప్రధాని ముఖ్య కార్యదర్శి, కేబినెట్ సెక్రటరీ, విద్యాశాఖలో సీనియర్ కార్యదర్శి తదితరులు ఇతర సభ్యులుగా ఉంటారు. ఎన్ఈసీకి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉంటారు. ఐదేళ్లపాటు అధికారంలో ఉండే ఆయనకు సహాయమంత్రి హోదా ఉంటుంది.
- **రాష్ట్రాల్లోనూ కమిషన్లు:** జాతీయ ఎడ్యుకేషన్ కమిషన్ తరహాలోనే అన్ని రాష్ట్రాల్లోనూ రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషన్లను ఏర్పాటు చేస్తారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉండే ఈ కమిటీలో విద్యాశాఖ మంత్రి వైస్ ఛైర్‌పర్సన్‌గా ఉంటారు.
- ఉన్నత విద్యలో పరిశోధనకు పెద్దపీట వేయాలని, ఇందుకు నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ అనే ఉన్నతస్థాయి సంస్థను ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది. ఈ నిధిని కేంద్రం రూ.20,000 కోట్లతో ఏర్పాటు చేస్తుంది. ప్రభుత్వ విద్యా సంస్థలతోపాటు ప్రైవేటు సంస్థలు కూడా పరిశోధనకు దీన్ని ఉపయోగించుకోవచ్చు. దేశంలో భవిష్యత్తులో స్వయంప్రతిపత్తి, గుర్తింపు పొందిన, అనుబంధ యూనివర్సిటీలు అనేవి ఉండవు. యూనివర్సిటీలంటే కేవలం పబ్లిక్, ప్రైవేటు, ప్రైవేటు ఎయిడెడ్ మాత్రమే. విశ్వవిద్యాలయాలు ఎంఫిల్ కోర్సులు ఎత్తివేయాలి. పీహెచ్‌డీ చేయాలంటే నాలుగేళ్ల పరిశోధన డిగ్రీ లేదా పీజీ డిగ్రీ ఉన్నవారికే అవకాశం ఇవ్వాలి.
- వైద్యవిద్యలో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశపరీక్ష (నీట్)ను నిర్వహిస్తున్నట్లు.. ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసిన తరువాత కూడా 'ఎగ్జిట్ పరీక్ష'ను నిర్వహించాలని కమిటీ అభిప్రాయపడింది.
- యూజీసీ, ఏఐసీటీఈ, పీసీఐ, ఎన్‌సీటీఈ తదితర నియంత్రణ సంస్థల స్థానంలో ఉన్నత, సాంకేతిక విద్యాసంస్థలకు కలిపి జాతీయ ఉన్నత విద్యానియంత్రణ సంస్థ (ఎన్‌హెచ్ఈఆర్ఏ)ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఉన్నత, సాంకేతిక విద్యలో అభివృద్ధి నిధులు, ఫెలోషిప్‌లను అందజేసే యూజీసీ పేరును హయ్యర్ ఎడ్యుకేషన్ గ్రాంట్స్ కౌన్సిల్ (హెచ్ఈజీసీ)గా మార్చాలని సూచించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషన్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ (ఐఐటీఐ) ఏర్పాటు చేయాలని, పాళి, పర్షియన్, ప్రాకృతిక భాషలకు కొత్తగా జాతీయ సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది.
- బ్యాచిలర్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ (బీఎల్ఏ) లేదా బ్యాచిలర్ ఆఫ్ లిబరల్ ఎడ్యుకేషన్ (బీఎల్ఈ) పేరిట నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టాలి. □

# సంపన్నులపై సామాన్యులను ఉసిగొల్పి భారీ రాజకీయ లబ్ధి పొందిన తొలి నేత మోదీ

- పంకజ్ మిశ్రా



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశంపై ఈ ఏడాది ఫిబ్రవరి 26 తెల్లవారు జామున పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లో గల ఉగ్రవాద శిబిరాలపై భారత వాయుసేన మెరుపుదాడులు జరిపింది. ఆ ఉదయం భారత్ పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల వాయుతలం దట్టంగా మేఘావృతమై వున్నది. వైమానిక దాడులకు మేఘాలు విఘాతమవుతాయేమోనని వాయుసేన అధికారులు సంశయిస్తుంటే వారి సంకోచాన్ని తోసిపుచ్చి కర్తవ్య పాలనకు పూనుకోమని స్పష్టం చేశానని 17 వ లోక్‌సభ ఎన్నికల ప్రచార తుదిదశలో మోదీ వెల్లడించారు. ఆయన ఇంకా ఇలా చెప్పారు: 'సైన్స్ గురించి నాకు ఏమీ తెలీదన్న మాట నిజం. అయితే నా 'సహజ వివేకాన్ని' పూర్తిగా విశ్వసించాను. ఆకాశం మేఘావృతమై ఉన్నందున భారతీయ ఫైటర్ జెట్స్‌ను పాకిస్థానీ రాడార్ కనుగొనలేదని నా సహజ వివేకం నాకు చెప్పింది'.

ఐదేళ్ల మోదీ పాలనలో ఆయన 'సహజ వివేకం' మూలంగా భారత్ అనేక విధాల నష్టపోయింది. నానా యాతనలు పడింది. ముఖ్యంగా 2016 నవంబర్‌లో మోదీ ప్రభుత్వం హఠాత్తుగా 90 శాతం కరెన్సీ నోట్లను చెలామణీ నుంచి ఉపసంహరించుకోవాలని నిర్ణయం తీసుకోవడంతో అసంఖ్యాక భారతీయులు అకారణంగా అవస్థల పాలయ్యారు. భారత ఆర్థిక వ్యవస్థకు అపార నష్టం కల్గించడం, దక్షిణాసియాను అణు యుద్ధం ముంగిటిలోకి తీసుకువెళ్లడం మొదలైన వాటితో ప్రపంచపు అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ అధిపతి అపాయకరమైన అనర్హుడు అని నరేంద్ర మోదీ రుజువు చేశారు. మోదీ పాలనలో నిరుద్యోగం అపారంగా పెరిగిపోయింది.., జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద హింసాకాండ బాగా పెచ్చరిల్లిపోయింది. గత ఫిబ్రవరిలో పాకిస్థాన్‌పై సంచలనాత్మక వైమానిక దాడుల్లో కొన్ని చెట్లు కూలిపోవడం మినహా ఆ దేశానికి ఏమీ నష్టం సంభవించలేదు. పేద భారతీయులు కొంతమందికి మోదీ పాలన మేలు చేయకపోలేదు. సొంత పాయిఖానా వసతి కల్పించారు. ప్రతి ఒక్కరూ బ్యాంక్ అకౌంట్‌ను కలిగివుండేందుకు సహకరించారు. స్వల్ప వడ్డీపై రుణ సదుపాయం, గృహ వసతి, విద్యుత్ సరఫరా, వంటగ్యాస్ సిలిండర్ మొదలైనవాటిని సమకూర్చారు. ఈ సహాయాల గురించి మోదీ ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకున్నది. మహా ఆడంబర పూర్వకంగా ప్రచారం చేసుకున్నది. ఇదిగో, ఈ ప్రచారం నుంచి మోదీ 2019 సార్వత్రిక ఎన్నికలలో బాగా లబ్ధి పొందారు. కార్పొరేట్ కంపెనీల నుంచి అందిన భారీ విరాళాలతో ఎన్నికల ప్రచారానికి, ప్రయోజనాలకు బీజేపీ అమితంగా ఖర్చు పెట్టగలిగింది. కార్పొరేట్ సంస్థల ఆధ్వర్యంలోని మీడియా మోదీని 'భారతదేశ సంరక్షకుడు'గా ఓటర్ల మనసులో సుప్రతిష్ఠితం చేసింది. ఇంతవరకు ఎటువంటి అభిశంసనకు గురికాని భారత రాజ్యాంగ సంస్థలలో ఎన్నికల సంఘం ఒకటి. అటువంటి సంస్థ కూడా ప్రస్తుత ఎన్నికలలో సిగ్గూఎగ్గూ లేకుండా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిందని ప్రతిపక్షాలు చేసిన విమర్శల్లో సహేతుకత ఎంతైనా ఉన్నది.

యువ భారతీయులపై మోదీ ప్రభావం అంతా ఇంతా కాదు. వారిని ఆయన తన వచో నైపుణ్యంతో మంత్రముగ్ధుల్ని చేశారు. 'నైతిక జీవితం తనను తాను సరిదిద్దుకొంటున్న ప్రక్రియను పరిశీలించడం అప్పుడప్పుడు సాధ్యమవుతుందని' అమెరికన్ సాహిత్య విమర్శకుడు లియోనెల్ ట్రిల్లింగ్ అన్నారు. భారతీయులు తమను తాము భావించు కుంటున్న, ప్రపంచాన్ని చూస్తున్న రీతిని నవీన

సాంకేతికతల సహాయంతో పూర్తిగా మార్చివేయడం, అలాగే సామాజిక పౌర జీవనం (పబ్లిక్ స్పియర్ కలసి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిపై చర్చించి, ఆ చర్చల ద్వారా రాజకీయ కార్యాచరణను ప్రభావితం చేసేందుకై సామాజిక జీవితంలో వ్యక్తులు ఒక్కటిగా కలిసివచ్చే కార్యక్షేత్రం)లో సంప్రదాయ పట్టణ ప్రాంత కులీన వర్గాలపై ప్రజల్లో విశృంఖల ఏహ్య భావాన్ని కల్పించడం ద్వారా మోదీ భారతదేశంలో అటువంటి ప్రక్రియను సృష్టించారు.

భారత్ ఒక అసంబద్ధ అసమానతల సమాజం. భారత రాజ్యాంగమూ, భారత రాజకీయ పక్షాలూ కులమతాలకు అతీతంగా భారతీయులందరూ సమానులేనని ఉద్ఘోషిస్తున్నాయి. విద్యా, ఉద్యోగావకాశాల విషయంలో ప్రతి ఒక్కరికీ సమానహక్కు ఉన్నదని చెబుతున్నాయి. అయితే ఈ సమానత్వ సూత్రాలు ఎంత భయానకంగా ఉల్లంఘనకు గురవుతున్నాయో అత్యధిక భారతీయుల నిత్య జీవితానుభవాలు నిరూపిస్తున్నాయి. భారతీయులలో అత్యధికులు మానవతా మెరుపుల ప్రజాస్వామిక ఆదర్శాలు, తుచ్ఛ, నీచ అప్రజాస్వామిక యథార్థాల మధ్య బలవంతంగా జీవిస్తున్నారు. వారి మనసు అగాథాల్లో ఆత్మన్యూనతా భావాలు, అసూయాద్వేషాలు, నానా అవమానాల గాయాలు పేరుకుపోయి వున్నాయి. ఒక కఠోర సామాజిక క్రమానుగత శ్రేణి (హిందూ వర్ణ వ్యవస్థకు మించిన ఉదాహరణ దీనికి మరొకటి ఏముంటుంది?)లో ఉన్నతస్థాయిలో ఉన్నవారి నుంచి ఎదురయిన అవమానాలు, అపజయాల నుంచే అవి అసంఖ్యాక భారతీయుల మనస్సుల్లో నిక్షిప్తమయ్యాయి.

ఈ ప్రమాదకర ఉద్రిక్తతలను, 1980వ దశకం తుదినాళ్లలో ఒక ప్రాంతీయ విశ్వవిద్యాలయ విద్యార్థిగా నేను ప్రత్యక్షంగా చూశాను, అనుభవించాను. విద్యా విషయిక ప్రతిభాపాటవాలలోనూ, సాంస్కృతిక రీతులు, ఆలోచనా ధోరణులలోనూ మెట్రో పాలిటన్ ఆంగ్ల విద్యాధికులకు దీటుగా భాసిల్లాలని మేము ఆరాటపడేవాళ్లం. నరేంద్ర మోదీ ఇటీవలి ఎన్నికల ప్రచారంలో ఎంతో అనుచితంగా మాట్లాడిన దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ మా ఆగ్రహానికి లక్ష్యంగా ఉండేవారు. వలసపాలన ముగిసిన అనంతరం ఆధునిక పాశ్చాత్య ప్రపంచస్థాయికి భారత్‌ను తీసుకువెళ్లే బాధ్యతలు చేపట్టిన, అయితే వాస్తవానికి తమ సొంత ప్రయోజనాల పరిరక్షణకు మాత్రమే ప్రాధాన్యమిచ్చిన కుహనా సామ్యవాద కులీన వర్గానికి ప్రతినిధి రాజీవ్‌గాంధీ. ఈ ఆంగ్ల విద్యాధిక మెట్రోపాలిటన్ పాలకవర్గం మమ్ములను చరిత్రలో ఒక నిస్సహాయ స్థితిలో వదిలివేసి, తాము మాత్రం సంపన్న పాశ్చాత్య ప్రపంచం సరసన ఉండడానికి ఆరాటపడింది. జాతి సర్వతోముఖాభివృద్ధికి బాధ్యత వహించాల్సిన ఆ కులీనవర్గం తమను నిర్లక్ష్యం చేయడం అసంఖ్యాక భారతీయులకు తీవ్ర మనస్తాపం కల్గించింది. ముఖ్యంగా 1990వ దశకంలో ప్రపంచీకరణ విధానాలను అనుసరించడం మొదలయిన తరువాత ఈ మనస్తాపం మరింత అధికమయింది. అమెరికన్ వ్యక్తి వాద ధోరణులు పెరిగి పోవడమూ, పల్లెల నుంచి పట్టణాలకు వలసలు ముమ్మర మవడమూ మొదలైన పరిణామాలు కూడా ఆ మానసిక గాయాలను మరింత తీవ్రం చేశాయి. వ్యక్తిగత సంపద, వినియోగం గురించి టీవీ, ఇంటర్నెట్‌లు ప్రజలను అనూహ్యరీతుల్లో ప్రభావితం చేశాయి.

సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చిన స్వతంత్ర భారత పాలకులకు వ్యతిరేకంగా అత్యధిక భారతీయులలో గుప్తంగా నెలకొన్న ఆగ్రహాన్ని, సామాజిక ఊర్ధ్వ గమనానికి తీవ్ర అవరోధాలుగా ఉన్న శక్తులపై నెలకొన్న తీవ్ర అసంతృప్తిని తమ రాజకీయ లక్ష్యాలకు ఉపయోగించుకునేందుకు జాతీయ రాజకీయాలలోకి నరేంద్ర మోదీ ప్రవేశించేంతవరకు ఏ రాజకీయవేత్తా ప్రయత్నించనే లేదు. 2002 గుజరాత్ మారణకాండకు నరేంద్రమోదీయే కారకుడని ఆంగ్ల విద్యాధికులు, పాశ్చాత్య ప్రభుత్వాలు తీవ్రంగా నిందించాయి. అమాయకుల ఊచకోతలు జరుగుతున్నా మోదీ ఉదాసీనంగా వ్యవహరించారని, అసలు ఆయనే ఆ హత్యాకాండను స్వయంగా పర్యవేక్షించారని కూడా ఆయన్ని విమర్శించాయి. భారతదేశపు కుబేరులు కొంతమంది సహాయ సహకారాలతో నరేంద్ర మోదీ ఈ కళంకం నుంచి బయటపడి 2014 సార్వత్రిక ఎన్నికల నాటికి జాతీయ స్రవంతి రాజకీయాలలోకి ప్రవేశించారు. తన సభికులలో అత్యధికంగా ఉండే అణగారిన వర్గాలవారిలో తానూ ఒకడినని మోదీ మొదటి నుంచీ చెప్పేవారు. స్వయం శక్తితో ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానని, ఈ క్రమంలో వంచకులు అయిన ముస్లింలను బుజ్జగిస్తూ తన లాంటి ఉత్తమ హిందువులను అన్ని విధాల అణచివేసేందుకు ప్రయత్నించిన వారిని అధిగమించేందుకు తాను ఎలా కష్టపడిందీ మోదీ వివరించేవారు. భారత్‌ను ఒక గొప్ప అంతర్జాతీయ శక్తిగా తీర్చిదిద్ది, హిందువులను మళ్లీ చరిత్ర పురోగమన ప్రస్థానంలో అగ్రగాములుగా నిలబెడతానని మోదీ వాగ్దానం చేసేవారు.

మోదీ ఐదేళ్ల పాలనలో భారతీయ నెటిజన్ల సంఖ్య రెట్టింపయింది. నిరుపేద చేతిలో కూడా స్మార్ట్ ఫోన్ కన్పించడం సాధారణమై పోయింది. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూ ట్యూబ్, వాట్సాప్ మొదలైన అధునాతన కమ్యూనికేషన్ సదుపాయాలతో ఫేస్ బుక్ విస్తృత స్థాయిలో అత్యధికులను చేరడమూ సాధారణమైపోయింది. ఈ పరిణామం విశేషంగా లబ్ధిని సమకూర్చింది. బాలాకోట్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత వాయుసేన దాడుల్లో వందలాది పాకిస్థానీయులు

హతమయ్యారన్న నకిలీ వార్త ఒకటి అసంఖ్యాక భారతీయ ఓటర్లను ప్రభావితం చేసి ఇటీవలి ఎన్నికల్లో మోదీ విజయానికి ఎంతైనా తోడ్పడింది.

భారత్‌లోనూ, పాశ్చాత్య దేశాలలోను ఎంతో మంది నయా ఉదారవాద వ్యాఖ్యాతలు ఆశిస్తున్నట్టుగా అశేష భారతీయులలో తాను ఉత్పన్నం చేసిన భావోద్వేగాలను బ్రహ్మాండమైన ఆర్థిక పురోగతికి తోడ్పడేవిగా మోదీ మార్చడం లేదు. ఆగ్రహపూరితులైన మనుషుల గురించి జర్మన్ తాత్వికుడు నీషే అన్నట్టు గూడుకట్టుకుపోయిన అధోస్థాయి ప్రతీకార వాంఛ అడ్డూఆపూ లేకుండా బద్దలవడానికి మాత్రమే దోహదం చేస్తున్నారు. కరడుగట్టిన మితవాదుల లక్ష్యమే మోదీ ఔదలదాల్చిన లక్ష్యం: మైనారిటీ వర్గాలు, శరణార్థులు, వామపక్షీయులు, ఉదారవాదులు మొదలైన ప్రగతిశీలురను బలిపశువులు చేస్తూ ఆగ్రహపూరితులైన ప్రజలను ఉత్సాహపరచడం, అదే సమయంలో పీక్కుతినే అధునాతన పెట్టుబడిదారీ విధానం సత్వర పురోగతికి తోడ్పడమూ, నిరుద్యోగులైన అసంఖ్యాక యువ భారతీయులకు అవసరమైన కొత్త ఉద్యోగాలను సృష్టించడంలో మోదీ విఫలమైనప్పటికీ ఆంగ్ల విద్యాధికులతో కఠోరంగా మాట్లాడేందుకు, సమాజంలో ఇప్పటికే ఉన్నత స్థితిలో ఉన్నవారిని తీవ్రంగా వ్యతిరేకించేందుకు అనుమతించారు. ఆంగ్ల విద్యాధికుల పట్ల మోదీలో ఉన్న తీవ్ర వ్యతిరేకత కూడా ఆయన్ని ఈ ధోరణికి పురిగొల్పిందని మరి చెప్పనవసరం లేదు. అశేష అణగారిన భారతీయులను నానా అన్యాయాల నుంచి విముక్తం చేయడానికి బదులుగా వారిలోని నిరాశామయ భావోద్వేగాలకు ఆయన విముక్తి కల్పించారు. మోసపూరిత పాకిస్థానీయులు, భారతీయ ముస్లింలు, ఈ 'జాతి వ్యతిరేకులను' బుజ్జగించే భారతీయులను ద్వేషించేందుకు తన మద్దతుదారులను మోదీ స్పష్టంగా పురిగొల్పారు.

ప్రతీకార ఉద్వేగాలు, వైభవోపేత అధికారం, ఆధిక్యతల స్వప్నాలతో ఓటర్లను మైమరపించడం ద్వారా తన సహజ వివేకపు వినాశనాత్మక పర్యవసానాలు ఇవి, మరే ఇతర రాజకీయవేత్తనైనా విధిగా పతనమొందించేవనడంలో సందేహం లేదు. ప్రజల నిశిత పరిశీలనలోకి రాకుండా నరేంద్ర మోదీ చాలా నేర్పుగా తప్పించుకోగలిగారు. నేడు పలు ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తున్న విద్వేష రాజకీయాలకు 2014లో ఈ హిందూత్వ నేత పథ నిర్దేశం చేశారు. 2019లో సత్యానంతర యుగపు సంచలనాత్మక ఎన్నికల విజయాలలో ఒకదానికి ఆయన సారథ్యం వహించారు. అయితే మోదీ జయధ్వానం భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు గురించి భయపడక తప్పని ఆగత్యాన్ని కల్పించింది.

*(న్యూయార్క్ టైమ్స్/ఆంధ్రజ్యోతి)*

# పవిత్ర యుద్ధం X పవిత్ర వ్యాసంగం

## (పంకజ్ మిశ్రాజీ వ్యాసంపై లోక్‌సత్తా టైమ్స్ స్పందన)

*రచయిత భావాలతో ఏకీభవించకపోయినా.. గౌరవించటం లేదా చర్చనీయాంశం చేయాలనుకోవటం కోసం కూడా పత్రికలు రచనల్ని ప్రచురిస్తుంటాయి. "పైస్థాయి వారిపై కిందిస్థాయి ప్రజలను ఉసిగొల్పి భారీ రాజకీయ లబ్ధి పొందిన తొలి నేత మోదీ" అంటూ పంకజ్ మిశ్రా రాసిన పైవ్యాసం (ఆంగ్లం నుంచి తెలుగులోకి స్వేచ్ఛానువాదం)లోని కొన్ని అభిప్రాయాలతోనూ, పలు చోట్ల రచయిత భావవ్యక్తీకరణ తీరుతో కూడా లోక్‌సత్తా ఏకీభవించటం లేదు. వాటిని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోంది కూడా. పరిష్కారంలేని ముగింపు వాక్యమున్న ఈ వ్యాసాన్ని లోక్‌సత్తా టైమ్స్‌లో వేయటం ఏ రకంగా ప్రయోజనకరం? అని సందేహించటం కూడా జరిగింది. అయితే ఇందులో రెండు ముఖ్యమైన అంశాలను పంకజ్ మిశ్రా ప్రస్తావించారు. వాటితో లోక్‌సత్తా ఏకీభవించటమేకాకుండా.. చర్చనీయాంశం చేయాలని భావిస్తోంది.*

*పంకజ్ మిశ్రా రాసిన ఆ అంశాలివి:*

*"భారత్ ఒక అసంబద్ధ అసమానతల సమాజం. భారత రాజ్యాంగమూ, భారత రాజకీయ పక్షాలూ కులమతాలకు అతీతంగా భారతీయులందరూ సమానులేనని ఉద్ఘోషిస్తున్నాయి. విద్యా, ఉద్యోగావకాశాల విషయంలో ప్రతి ఒక్కరికీ సమానహక్కు ఉన్నదని చెబుతున్నాయి. అయితే ఈ సమానత్వ సూత్రాలు ఎంత భయానకంగా ఉల్లంఘనకు గురవుతున్నాయో అత్యధిక భారతీయుల నిత్య జీవితానుభవాలు నిరూపిస్తున్నాయి. భారతీయులలో అత్యధికులు మానవతా మెరుపుల ప్రజాస్వామిక ఆదర్శాలు, తుచ్ఛ, నీచ అప్రజాస్వామిక యథార్థాల మధ్య బలవంతంగా జీవిస్తున్నారు. వారి మనసు అగాథాల్లో ఆత్మన్యూనతా భావాలు, అసూయాద్వేషాలు, నానా అవమానాల గాయాలు పేరుకుపోయి వున్నాయి. ఒక కఠోర సామాజిక క్రమానుగత శ్రేణి (హిందూ వర్ణ వ్యవస్థకు మించిన ఉదాహరణ దీనికి మరొకటి ఏముంటుంది?)లో*

ఉన్నతస్థాయిలో ఉన్నవారి నుంచి ఎదురయిన అవమానాలు, అపజయాల నుంచే అవి అసంఖ్యాక భారతీయుల మనస్సుల్లో నిక్షిప్తమయ్యాయి.

"సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చిన స్వతంత్ర భారత పాలకులకు వ్యతిరేకంగా అత్యధిక భారతీయులలో గుప్తంగా నెలకొన్న ఆగ్రహాన్ని, సామాజిక ఊర్ధ్వ గమనానికి తీవ్ర అవరోధాలుగా ఉన్న శక్తులపై నెలకొన్న తీవ్ర అసంతృప్తిని తమ రాజకీయ లక్ష్యాలకు ఉపయోగించుకునేందుకు జాతీయ రాజకీయాలలోకి నరేంద్ర మోదీ ప్రవేశించేంతవరకు ఏ రాజకీయవేత్తా ప్రయత్నించనే లేదు.

"భారత్‌లోనూ, పాశ్చాత్య దేశాలలోను ఎంతో మంది నయా ఉదారవాద వ్యాఖ్యాతలు ఆశిస్తున్నట్టుగా అశేష భారతీయులలో తాను ఉత్పన్నం చేసిన భావోద్వేగాలను బ్రహ్మాండమైన ఆర్థిక పురోగతికి తోడ్పడేవిగా మోదీ మార్చడం లేదు. ఆగ్రహపూరితులైన మనుషుల గురించి జర్మన్ తాత్వికుడు నీషే అన్నట్టు గూడుకట్టుకుపోయిన అధోస్థాయి ప్రతీకార వాంఛ అడ్డూఆపూ లేకుండా బద్దలవడానికి మాత్రమే దోహదం చేస్తున్నారు.

"నిరుద్యోగులైన అసంఖ్యాక యువ భారతీయులకు అవసరమైన కొత్త ఉద్యోగాలను సృష్టించడంలో మోదీ విఫలమైనప్పటికీ ఆంగ్ల విద్యాధికులతో కఠోరంగా మాట్లాడేందుకు, సమాజంలో ఇప్పటికే ఉన్నత స్థితిలో ఉన్నవారిని తీవ్రంగా వ్యతిరేకించేందుకు అనుమతించారు. ఆంగ్ల విద్యాధికుల పట్ల మోదీలో ఉన్న తీవ్ర వ్యతిరేకత కూడా ఆయన్ని ఈ ధోరణికి పురిగొల్పిందని మరి చెప్పనవసరం లేదు. అశేష అణగారిన భారతీయులను నానా అన్యాయాల నుంచి విముక్తం చేయడానికి బదులుగా వారిలోని నిరాశామయ భావోద్వేగాలకు ఆయన విముక్తి కల్పించారు".

.. వ్యాసంలోని ఈ భావాలతో లోక్‌సత్తా ఏకీభవిస్తుంది, వీటిపై జనానికి అర్థమయ్యేదాకా మళ్లీ మళ్లీ చర్చ జరిగాలని భావిస్తుంది.

డబ్బు కోసం సంపన్నులు – ఓట్ల కోసం సామాన్యులు – అధికారం కోసం వీరిద్దరి మధ్యా చిచ్చు

ఉన్నత వర్గీయులు ఉన్నకొద్దీ ప్రభుత్వాల్ని పట్టించుకోకుండా బతకటం, జనాభాలో అత్యధికంగా ఉన్న సామాన్యులు ఉన్నకొద్దీ ప్రభుత్వం మీద ఎక్కువ ఆధారపడుతుండటం పాలన, రాజకీయ, ప్రజాస్వామ్య సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుందని.. దీన్ని పరిష్కరించేలా వ్యవహరించకుండా ప్రధాని నరేంద్రమోదీ ఒకపక్క ఉన్నత వర్గీయులపై సామాన్య ప్రజానీకాన్ని ఉసిగొల్పుతూ, మరోపక్క ఉన్నత వర్గీయుల ప్రయోజనాలకు ఎటువంటి నష్టం కలగకుండా రహస్య భరోసానిస్తూ రెండు నాల్కల రాజకీయం చేస్తున్నారని పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) సమయంలోనే లోక్‌సత్తా టైమ్స్‌లో కవర్‌స్టోరీని ప్రచురించాం. 'డబ్బు కోసం సంపన్నులు – ఓట్ల కోసం సామాన్యులు – అధికారం కోసం వీరిద్దరి మధ్యా చిచ్చు' అనే రాజకీయాన్ని మోదీ విజయవంతంగా నడపగలుగుతున్నారని వివరించాం.

"నల్లధనం, దానితో ముడిపడివున్న అవినీతిపై పోరాటంలో ముందు చేయాల్సిన చర్యలు తీసుకోకుండా కేవలం ప్రచారంతో హడావుడితో ప్రజలను విభజించే స్థాయికి సాక్షాత్తూ ప్రధానే వెళ్లారు. తమకొచ్చిన కష్టం కంటే.. డబ్బున్నవాళ్ల సొమ్ములు పోనాయి అని ఆనందించిన పేద, దిగువ మధ్యతరగతి జనాన్ని మోదీ మాటలు బాగానే రంజింపచేశాయి.

"సాక్షాత్తూ ప్రధానే దేశ ప్రజలను వర్గాలుగా విభజించి, డబ్బున్నవాళ్లు సమాజానికి శత్రువులనే భావాన్ని కలిగించారు.

"డబ్బున్నవాళ్లు ఈ ప్రచారాన్ని పట్టించుకోకుండా తనకు, తన పార్టీ రాజకీయానికి యధావిధిగా తోడ్పాటునందించాలని ఆయన మరోవైపు రహస్యంగా వారికి సంకేతమిచ్చి బైటపడవచ్చుగానీ, ఈ ధోరణి దేశాన్ని తిరోగమన ఆలోచన దిశగా మళ్లించేదిగా ఉంది"

.. అని జనవరి 2017 లోక్‌సత్తా టైమ్స్ సంచిక కథనంలో రాశాం.

డీమానిటైజేషన్‌ను అసమర్థంగా, అరకొరగా అమలు చేయటం వల్ల తలెత్తిన సమస్యల్ని, సెగల్ని తప్పించుకోవటానికి మోదీ డబ్బున్నవారు–పేదల మధ్య చిచ్చురగిల్చారని తొలుత భావించినా, ఆ తర్వాత పరిణామాలను కూడా చూశాక ఇదంతా ఒక గొలుసుకట్టు పార్టీ రాజకీయ వ్యూహమని అర్థం చేసుకోవాల్సి వచ్చింది.

'అశేష భారతీయులలో తాను ఉత్పన్నం చేసిన భావోద్వేగాలను బ్రహ్మాండమైన ఆర్థిక పురోగతికి తోడ్పడేవిగా మోదీ మార్చటం లేదని' పంకజ్ మిశ్రా రాసిన మాటలు కూడా వాస్తవం. అలా మార్చే సంకల్పం ఉంటే.. పెద్ద నోట్ల రద్దు సమయంలోనే లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇచ్చిన రోడ్‌మ్యాప్‌నే తీసుకుని అవినీతిని,

## రాజ్యాంగబద్ధ రాజ్యవ్యవస్థకి, భారతీయ సమాజానికి మధ్య అదుపులోకి రాని సంఘర్షణ

రాజ్యాంగబద్ధ రాజ్యవ్యవస్థకి – భారతీయ సమాజానికి మధ్య ఉన్న సంఘర్షణను అదుపు చేసి సాధారణ స్థాయికి తేలేకపోవటమే ఈవేళ భారతదేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య. బలమైన భారతీయ సమాజంలో మానవీయ విలువలు, వివక్షకు ఆస్కారంలేని ధర్మం, న్యాయం కూడా బలంగా ఉన్నట్లయితే ఆదర్శప్రాయమైన రాజ్యాంగ బద్ధతని, రాజ్యాంగ విలువల్ని కొంత తేలిగ్గానే అందిపుచ్చుకోగలిగేది. కానీ మెజారిటీ మతం చుట్టూ పాతుకుపోయిన అమానుషమైన రకరకాల వివక్షలు పెద్దఎత్తున కొనసాగుతున్నాయి. అందువల్లే ఉదాత్త రాజ్యాంగంతో తీవ్ర, ప్రతికూల సంఘర్షణతోనే భారతీయ సమాజం ప్రస్థానం స్వతంత్ర భారతదేశంలో మొదలైంది. రాజ్యాంగానికి, సమాజానికి మధ్య అంతరాన్ని పూడ్చే వ్యవస్థల నిర్మాణ బాధ్యతని రాజకీయం విస్మరించటం వల్ల ఆ ఘర్షణ ఇన్ని దశాబ్దాల తర్వాత కూడా అదుపులోకి రాలేదు. వివక్షలు, అణచివేతల మతాన్ని నేరుగా రాజకీయాల్లో ఉపయోగించుకున్న పార్టీతోపాటు మతాన్ని నేరుగా ప్రస్తావించకుండా రాజకీయం చేసిన పార్టీలు కూడా సమాజంలోని మతజాడ్యాలతో లబ్ధిపొందే ప్రయత్నం చేశాయి. ఆ మేరకు రాజ్యాంగాన్ని దెబ్బతీశాయి. సమాజానికి–రాజ్యాంగానికి మధ్య ప్రతికూల, తిరోగమన ఘర్షణ లేకుండా రాజకీయం చేయటాన్ని ఒక ఒరవడిగా అన్ని పార్టీలూ ఇప్పటికైనా ఏకాభిప్రాయంతో స్వీకరించాలి.

రాజ్యాంగ లక్ష్యాలు ఏదోకరూపంలో సమాజానికి ఆదర్శంగానే కొనసాగుతుంటాయి. కానీ వాటి మధ్య తీవ్ర, ప్రతికూల ఘర్షణ లేకుండా సాధారణస్థాయిలో, నిర్మాణాత్మక తీరులో ఉంటేనే ప్రజలకు సామాజిక ఒడంబడిక సారాంశమైన మంచి పాలన, సుఖసంతోషాలతో కూడిన జీవితం సాధ్యమవుతాయి. వ్యక్తి స్వేచ్ఛనిచ్చే రాజ్యాంగానికి సమాజంతో ఉన్న వైరుధ్యాల్ని పరిష్కరించే పని చేయకుండా మతం, కులం ద్వారా అనేక లొసుగులతో ఉన్న బలమైన సమాజాన్నే ఓటుబ్యాంకుగా వినియోగించుకునే రాజకీయం చేస్తానంటే, అది బీజేపీని గెలిపించే పవిత్రయుద్ధమే కావచ్చుగానీ.. దేశ ప్రజలను మాత్రం ఓడిస్తుంది. అందుకే రాజ్యాంగాన్ని, సమాజాన్ని సంధానం చేస్తూ అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే పవిత్ర వ్యాసంగ రాజకీయం చేయటమే మోదీ మలిదశ ఘనవిజయం ముందున్న సరైన కర్తవ్యం.

నల్లధనాన్ని పూర్తిగా నియంత్రించగలిగే వ్యవస్థను దేశంలో నిర్మించగలిగే వారు. అవినీతిని, నల్లధనాన్ని అంతం చేయటానికి నోట్ల రద్దు ఓ పెద్ద తొలి అడుగు మాత్రమేనని, వాటి అంతానికి కొన్ని నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని ఆచరణాత్మకంగా లోక్‌సత్తా పరిష్కారాల్ని పలు వేదికల నుంచి అందించినా ప్రధాని ఆసక్తి చూపలేదు. వైఫల్యం కనిపిస్తున్నప్పుడల్లా, డీమానిటైజేషన్ లక్ష్యాలపై మాటలు మారుస్తూ పోయారు. దీంతో, సంపన్నులు, దోపిడీతో రాజకీయాల్లో చెలామణి అవుతున్న ప్రముఖులపై కోట్లాది ప్రజల్లో ఉన్న కసిని తన రాజకీయ లబ్ధికి ఉపయోగించుకునే ఎత్తుగడలో భాగంగా కూడా మోదీజీ పెద్ద నోట్ల రద్దును ప్రయోగించారని నిర్ధారణైంది.

నోట్ల రద్దు వల్ల మోదీ పార్టీకి రాజకీయ ప్రయోజనం లభించగా, దేశ ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. దేశం కన్నా పార్టీ మిన్న, పార్టీ కన్నా నేను మిన్న.. అనుకునే మోదీ ధోరణి వల్ల– 2014లో దేశానికి లభించిన ఒక బలమైన నాయకత్వం, గొప్ప ప్రజాతీర్పు పక్కదోవ పట్టింది. ప్రజల మధ్య మోదీ సృష్టించిన ఈ రాజకీయ విభజన తప్పిదాన్ని లోక్‌సత్తా టైమ్స్‌లో పలు సందర్భాల్లో పరిష్కారాలతో ఎత్తిచూపాం.

ఇక ఇప్పుడు వ్యాసంలో పంకజ్‌మిశ్రా పేర్కొన్న ఇంకా ముఖ్యమైన, మౌలికమైన అంశం దగ్గరకు వద్దాం.

కులమతాలకతీతంగా భారతీయులందరూ సమానమేనని, విద్యా, ఉద్యోగాల విషయంలో ప్రతి ఒక్కరికీ సమానహక్కు ఉన్నదని భారత రాజ్యాంగం ఉద్ఘోషిస్తున్నా, సమానత్వ సూత్రాలు ఎంత భయానకంగా ఉల్లంఘనకు గురవుతున్నాయో అత్యధిక భారతీయుల నిత్య జీవితానుభవాలు నిరూపిస్తున్నాయని మిశ్రా రాశారు. భారతీయులలో అత్యధికులు మానవతా మెరుపుల ప్రజాస్వామిక ఆదర్శాలు, తుచ్ఛ, నీచ అప్రజాస్వామిక యథార్థాల మధ్య బలవంతంగా జీవిస్తున్నారని, వారి మనస్సుల్లో ఆత్మన్యూనతలు, అసూయాద్వేషాలు, అవమానభారాలు గూడు కట్టుకుని ఉన్నాయని ఉద్ఘాటించారు. వాస్తవానికి ఇది ఇండియా ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాలు!

రాజ్యాంగానికి-సమాజానికి మధ్య వారధిని నిర్మించటం దేశ రాజకీయానికి ఇప్పటివరకూ చేతకాలేదు. ఆ దిశగా ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో, ఆచరణసాధ్యమైన ప్రయత్నం చేద్దామన్న సీరియస్ దృష్టి కూడా ప్రధాన రాజకీయ పార్టీల్లో కరవైంది. అందుకే కులం, మతం పేరుతో కోట్లాదిమంది బతుకులు ఇప్పటికీ అణగారిపోతున్నాయి, పుట్టుకను బట్టి వారి జీవితాలస్థాయి నిర్ణయమైపోతోంది. వివక్షలు వివిధ రూపాలలో వీరిని నిత్యం మానసిక వేదనకు గురిచేస్తున్నాయి.

అణచివేత లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చేందుకు హామీ ఇచ్చిన రాజ్యాంగానికి, సమాజానికి మధ్య సంధానం చేయాల్సిన బాధ్యతను నెరవేర్చాల్సిన రాజకీయం ఆ పని చేయకుండా.. రాజ్యాంగాన్ని కేవలం ఎన్నికల్లో నెగ్గటానికి, ప్రమాణ స్వీకారానికి, ప్రజలను రాజ్యవ్యవస్థకు బద్ధులను చేయటానికి మాత్రమే ఉపయోగిస్తుండటం వల్లే 1996-97లో లోక్‌సత్తా రాజకీయ ఉద్యమం కూడా ప్రారంభం కావాల్సి వచ్చింది. 'వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు', 'నివారించదగ్గ బాధలను తొలగించటం' అనే రెండు సూత్రాలూ లోక్‌సత్తా భావజాల సారాంశాలు. ఒకరకంగా చెప్పాలంటే, భారత రాజ్యాంగమే లోక్‌సత్తా భావజాలం. వీటిని కేవలం నినాదాలుగా కాకుండా అమల్లోకి తేవటానికి ఆచరణీయమైన, ఆమోదయోగ్యమైన విధానాలతో లోక్‌సత్తా ఒక ఎజెండాగా, వేదికగా ప్రజల ముందుకొచ్చింది. స్థూలంగా చెప్పాలంటే.. తగిన వ్యవస్థల్ని, పద్ధతుల్ని రాజకీయ పార్టీలు, సామాజిక రాజకీయం నిర్మిస్తేనే రాజ్యాంగానికి, సమాజానికి మధ్య ఉండే అంతరాన్ని తొలగించటం సాధ్యమవుతుంది. ఇందుకోసం నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, అధికార వికేంద్రీకరణతో స్థానిక స్వయంపాలన, ప్రజల మధ్య సామరస్యత, చట్టబద్ధపాలన, మౌలిక వసతులు వంటి అంశాలను ప్రభుత్వం తన ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలి. ఇవి లేకుండా, ప్రపంచంలోని ఏ దేశంలోనూ వెనుకబాటుతనం పోయిన దాఖలాలు లేవు. సరైన విద్య లేకుండా కుల మత వివక్షలు ఎలా పోతాయి? ప్రజల్లో ఉన్న న్యూనతాభావం, అసూయాద్వేషాలు, అవమానగాయాలు ఎలా తొలగుతాయి? ఇప్పుడున్న సమాజంలో అంతా బాగుందంటే, ప్రజల్లో ఇంతస్థాయి అసమానతలు, వాటి నుంచి కసి ఎందుకున్నాయి?

మన సమాజం ఎంత బలంగానైనా ఉండొచ్చు.. కానీ ఆ బలం కింద ఎంతో అణచివేత, కోట్లాదిమంది ఆక్రోశం ఉన్నాయి. మన సమాజంలోని అసమానతలకు, ఆక్రోశాలకు పూర్తిగా కాకపోయినా చాలామట్టుకు మెజారిటీ ప్రజలు పాటించే హిందూ మత విశ్వాసాలు, అందులో భాగంగా ఉన్న కులవివక్ష కారణాలు. ఈ అసమానతల్ని, ఆక్రోశాల్ని పరిష్కరించేందుకు రాజ్యాంగాన్ని సమాజంతో కలిపే ప్రయత్నం చేయకుండా, సమాజంలోని మంచితోపాటు చెడుకు కూడా పెద్దకారణమైన మెజారిటీ మతవిశ్వాసాన్ని నేరుగా రాజకీయానికి పునాది చేసేందుకు మోదీ ప్రయత్నించారు.

నిజానికి 2014లో నరేంద్ర మోదీకి ప్రజలిచ్చిన తీర్పు.. రాజ్యాంగం-సమాజం మధ్య ఉన్న అంతరాన్ని తొలగించే దిశగా ఒక చరిత్రాత్మక అవకాశం. కానీ సమాజంలోని లోపాల్ని సరిదిద్దుతూ భారత్ ఎదిగేలా, భారత్ సుస్థిరాభివృద్ధి దేశంగా రూపుదిద్దుకునేలా విధానాల్ని అమలు చేయటంలో, సుపరిపాలనకు సంస్థాగత నిర్మాణం చేయటంలో ఆ అవకాశాన్ని ఆయన వినియోగించుకోలేకపోయారు.

'మహాత్మాగాంధీని చంపిన గాడ్సే నిజమైన దేశభక్తుడు' అనేంత మతఛాందసం మోదీలో లేదుగానీ, అలా అనేవారి పట్ల కఠిన చర్యలు తీసుకోగల శక్తి, పరిణతి, దార్శనికత కూడా ఆయనలో కనిపించటం లేదు. రాజ్యాంగ సంస్థలకు, మతవాదానికి మధ్య సంఘర్షణ ఏర్పడినప్పుడు రెండోదానివైపే మొగ్గు చూపుతూ రాజ్యాంగ సంస్థలను బలహీనపరిచారు. రాజ్యాంగ సంస్థలకు, ఎన్నికల్లో విజయానికి మధ్య ఘర్షణ తలెత్తినప్పుడూ రాజ్యాంగ సంస్థలనే దెబ్బతీశారు. మెజారిటీ ప్రజల మతం, దాని మీద జాతీయవాదం, ఈ రెంటి మీదా ఎన్నికల విజయం అనే తరహా యథాతథ సమాజ రాజకీయం కోసం రాజ్యాంగ సంస్థలనే కాకుండా, రాజ్యాంగ నిర్దేశాల్ని, విలువలను కూడా మోదీ చిన్నచూపు చూశారు. కేంద్రీకృత పాలన సాగించారు.

సమాజంలోని లోపాల్ని సరిచేస్తూ ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించటానికి.. సమానస్థాయిని, అవకాశాల్ని కల్పించటానికి.. వ్యక్తి గౌరవాన్ని పరిరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించటానికి రాజ్యాంగం ఇచ్చిన నిర్దిష్ట హామీని అమలు చేయటానికి కావలసిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన వంటి అంశాల పట్ల మోదీ చాలా మొక్కుబడిగా వ్యవహరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తూ కించపరుస్తున్నా వాటిని ప్రక్షాళన చేసి స్వతంత్ర భారతదేశం ప్రజలకిచ్చిన రాజ్యాంగ సార్వభౌమాధికారాన్ని

నిలబెట్టటానికి మోదీ ప్రయత్నించ లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు, జాప్యాలు లేకుండా ప్రజలకు నాణ్యమైన సేవలందించేందుకు 'పౌర సేవల' చట్టం వంటివి తేకుండా.. గతిలేక ఓ సర్టిఫికెట్ కోసం లంచం ఇచ్చే పౌరులకు 3 ఏళ్ల నుంచి 7 ఏళ్ల వరకు కఠిన కారాగార శిక్ష, లంచం తీసుకున్న అధికారిపై మాత్రం విచారణకు కూడా ముందస్తు ప్రభుత్వ అనుమతి అవసరం అనే సవరణల్ని అవినీతి నిరోధక చట్టానికి తీసుకొచ్చారు. ఈ చర్యలన్నీ ప్రజల మధ్య అసమానతల్ని పెంచి, ప్రజలు తలెత్తుకుని బతికే అవకాశాల్ని తుంచేవే. తీవ్ర అసమానతలున్న సమాజంలో గతమంతా ఘనమైనదేనని చెప్పటం, మతవిశ్వాసాలను రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి పునాది చేయటానికి ప్రయత్నించటం, సంపన్నులకు-పేదలకు, మెజారిటీకి-మైనారిటీకి మధ్య చిచ్చు పెట్టి ప్రజల్ని విభజిస్తూ ఓట్లు దండుకోవటం ఒక తప్పిదమైతే.. ఉదాత్త రాజ్యాంగాన్ని-మెజారిటీ మత ప్రభావంతో అణచివేత స్వభావమున్న బలమైన సమాజాన్ని సంధానం చేసేందుకు రాజ్యాంగబద్ధ విధుల్ని సక్రమంగా నెరవేర్చకపోవటం ఇంకో పెద్ద తప్పిదం. మోదీ వ్యక్తిగత నిజాయతీని ఎవరూ శంకించటం లేదు. మతపరమైన ఆయన విశ్వాసం కూడా స్వచ్ఛమైనదే. కానీ ఆ ఛత్రంలో ఆయన చేస్తున్న పవిత్రయుద్ధాలు ఆయన పార్టీకి, పైస్థాయిలోని కొద్దిశాతం మందికి లబ్ధి చేకూరుస్తున్నాయి తప్ప దేశ ప్రయోజనాలకు, కోట్లాదిమంది ఎదుగుదలకు పెద్దగా ఉపయోగపడటం లేదు. భారతదేశం ఉన్న స్థితికి, ఉండాల్సిన స్థితికి మధ్య అంతరం నానాటికీ పెరుగుతోంది.

భారత్ అగ్రస్థాయిని అందుకునే అవకాశాలు దాదాపు కనుమరుగైనట్లేనని, పడుతూ లేస్తూ సాగే ఒక సాదాసీదా మధ్యాదాయ దేశంగా మాత్రమే కొనసాగే అవకాశముందని ఇప్పటికే హెచ్చరికలు వచ్చేస్తున్నాయి. ప్రజలు తనకిచ్చిన చరిత్రాత్మక తీర్పులు ఈ దేశానికి ఉపయోగపడాలని, లేకుంటే తన పార్టీ ఎంత ఘనవిజయాల్ని సాధించినా అవి మురిగిపోతాయని మోదీ 2019 మలి విజయం తరువాతైనా గుర్తించాలి. మత భావనల చుట్టూ పవిత్రయుద్ధాలతో పార్టీని గెలిపించటం ఆపి, మతాన్ని వ్యక్తిగతానికి (వ్యక్తిస్వేచ్ఛకు రాజ్యాంగం తిరుగులేని హామీనిస్తోంది) పరిమితం చేయాలి. రాజకీయాల్ని పవిత్ర వ్యాసంగంగా చేసే కొత్త పోకడలతో పాలన, రాజకీయంతో గెలవటం మొదలుపెట్టాలి. రాజకీయాల్ని పవిత్ర వ్యాసంగంగా చేయటమంటే.. మాటలలోకాకుండా, చేతల్లో రాజ్యాంగ బద్ధతకు, విలువలకు ప్రాధాన్యతనివ్వాలి, సంపన్నులు, పేదలు, ఈ కులం, ఆ మతం అని తేడా లేకుండా అందరికీ ఎదిగేందుకు సమానావకాశాల్ని అందుబాటులోకి తేవాలి, అధికారాన్ని వికేంద్రీకరిస్తూ జనం చేతుల్లోకి తీసుకెళ్తూ సాధికారతను పెంపొందిస్తుండాలి. అలాంటి రాజకీయం చేసినప్పుడు మాత్రమే మోదీ బీజేపీకే కాకుండా ఈ దేశానికి కూడా గొప్ప అవకాశమవుతారు, మోదీకిచ్చిన ప్రజాతీర్పు చరిత్రాత్మకమవుతుంది, ఆయన కలలుగంటున్నట్లు చరిత్రలో నిలిచిపోతారు.

మిగిలిన పార్టీలకు 2019 ఓటమి నుంచయినా కనువిప్పు కలగాలి. రాజ్యాంగానికి, సమాజానికి మధ్య అగాధాన్ని పూరించే వ్యవస్థల నిర్మాణం లేకపోవటం వల్లే మోదీ అనే నేత సంపన్నులు-పేదల మధ్య చిచ్చుపెట్టగలిగారని, మెజారిటీ ప్రజల మతాన్ని రెచ్చగొట్టగలిగారని, వ్యక్తిగత నిజాయతీని అవినీతిపై పెద్దపోరాటంగా భ్రమింప చేయగలిగారని, రాజ్యాంగ వ్యవస్థలను తమ మీదకు ఉసిగొల్పుతూ బలహీనపరచగలిగారని గుర్తించాలి. మోదీని ఎదుర్కోవాలన్నా, మోదీ పార్టీకి ప్రత్యామ్నాయంగా నిలవాలన్నా రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య రాజకీయమే ప్రతిపక్షాలకు సైతం ఏకైక మార్గం. ప్రజల ఆక్రోశం బద్దలవకుండా తాత్కాలిక తాయిలాలతో ఎల్లకాలం లేపనాలు పూస్తూ చల్లార్చలేరు. లేదా మోదీ చేసినట్లు, ఆ ఆగ్రహాన్ని డబ్బున్నవారిపై మళ్లిస్తూనో, మెజారిటీ హిందూత్వ పూనకంతోనో, మరోఎత్తుగడతోనో ఎల్లకాలం ఓట్లు దండుకోలేరు. రాజ్యాంగ ప్రజాస్వామ్య వ్యవస్థ వేళ్లూనుకుంటేనే, ప్రజలకు తమ పన్నుల డబ్బుకు-తాము వేసే ఓటుకు మధ్య సంబంధం అర్థమవుతుంది, సమర్థత, నిబద్ధత ఉన్న సామాన్యులు తమ జీవనోపాధి చూసుకుంటూనే చట్టసభలకు ఎన్నికవగలుగుతారు. సంపన్నులు, ఆదాయవనరులున్నవారు సైతం జాతీయోద్యమకాలంలో గాంధీ, నెహ్రూ, పటేల్, రాజేంద్రప్రసాద్, ప్రకాశం పంతులు వంటి నేతల్లా రాజకీయాలను, పాలనను పట్టించుకుని దేశాన్ని సుసంపన్నం చేస్తారు, సామాన్య ప్రజల ద్వేషానికి బదులు వారి మన్ననల్ని పొందగలుగుతారు.

తన ఎన్నికల విజయాల్ని దేశ విజయాలుగా మార్చి చరిత్రపుటల్లోకెక్కటానికి మోదీకి.. మోదీని జయించటానికి పవిత్రయుద్ధాల్ని ఇంకా మెరుగ్గా ఎలా చేయాలి అని వెతుకుతున్న ప్రతిపక్షాలకు కూడా 'రాజకీయాన్ని అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే పవిత్ర వ్యాసంగంగా మార్చే కృషిని ప్రారంభించి ప్రజలను ఎక్కడికక్కడ భాగస్వాముల్ని చేయటమే' సరైన పరిష్కార పంథా. ఈ కృషిలో పోటీపడటంలోనే వారి విజయం, దేశ ప్రజల విజయమూ ఉన్నాయి. థాంక్యూ పంకజ్ మిశ్రాజీ! □

# ఫెడరల్ ఫ్రంట్ కన్నా ముందు నెరవేర్చాల్సిన బాధ్యతలు

- ఎ. అన్నపూర్ణ, కేలిఫోర్నియా



తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఫెడరల్ ఫ్రంట్ పేరుతో జాతీయస్థాయిలో చక్రం తిప్పాలని ఆశ పడ్డారు.

"నరేంద్రమోదీ, రాహుల్‌గాంధీ స్పీచ్‌లు వింటే మైకులు పగిలిపోతున్నయి. అసలు దొంగలు ఈ ఇద్దరే. ఈ మాట కఠినంగా ఉన్నా ఇది సత్యం. వీరు ఒకరికొకలు తిట్టుకుంటుంటే ప్రపంచం నవ్వుతుంది. అసలు దేశం అభివృద్ధి పక్కన పెట్టి వీళ్లు మాట్లాడే తీరు సరైనదేనా? ప్రధానమంత్రి చౌకీదార్ కాదు దొంగ అని రాహుల్‌గాంధీ అంటడు.. తల్లికొడుకులు జమానాత్ మీద బయటతిరుగుతున్నరని ప్రధానమంత్రి అంటడు. ఇది చీప్ దందా. చేయాల్సిన పని చేయకుండా రాష్ట్రాల మీద పెత్తనం చేస్తారు. ప్రపంచంలో ఏ దేశంలోనైన ఇట్ల జరుగుతదా.. ఓ మోటు సామెత తెలంగాణలో ఉంటది. చేసిన పని చేయక ఏదో చేసినట్లుంటుంది వీరి తీరు. ఈ దిక్కుమాలిన పార్టీలకు సంపాదన పెంచే తెలివి లేదు. ఎప్పటివో పాతమాటలు మాట్లాడతరు. చైనా దేశం వాళ్లు ఎక్కడున్నరు.. మనమెక్కడున్నం. మనకు గంగానది ఉన్నట్లే, అక్కడ యాంకీ నది ఉంటది. మనకన్న వ్యవసాయభూమి తక్కువ. ఎడారి ఎక్కువ. 1600 కిలోమీటర్లు పైపుల ద్వారా నీళ్లు తీసుకెళ్లే ప్రాజెక్టును మూడేళ్లల పూర్తిచేసిండ్రు. అంతర్జాతీయ ట్రక్కుల వేగం గంటకు 80 కి.మీ. వెళితే మనదేశంలో 36 కి.మీ. పోతుంది. చైనా దేశంలో 1975 వరకు తక్కువ జీడీపీ ఉండె. ఇప్పుడు మారింది. ఇలా ఉన్నయి. దేశానికి ఇదేమీ దౌర్భాగ్యం? ఇదీ జాతీయపార్టీలు చేసింది. ఇంత దిక్కుమాలినతనం ఎక్కడన్న ఉంటదా? న్యాయవ్యవస్థ, శాసనవ్యవస్థ, ప్రభుత్వ పాలన తీరులో మార్పులు రావాలె. ఇవన్నీ జరగాలంటే ప్రాంతీయ పార్టీలతో ఫెడరల్ ఫ్రంట్, సమాఖ్య ప్రభుత్వం రావాలె. దేశంలో మార్పులు రావాల్సిన అవసరముంది. ఈ ఎన్నికల తరువాత పరిస్థితుల్ని గమనించి సంభవించే పరిణామాలు చూసి.. ఒకవేళ అవసరమైతే జాతీయపార్టీని పెట్టి అందరినీ ఒక్కటి చేస్త. ఎవరో ఒకరు నడుం గట్టాలె" అని ఇటీవలి పార్లమెంటు ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని సభల్లో కేసీఆర్ విరుచుకుపడ్డారు. మజ్లిస్ మినహా మిగిలిన 16 సీట్లలోనూ, వైఎస్‌జగన్ పార్టీని గెలిపిస్తే పొరుగు రాష్ట్రంలో వైఎస్ జగన్ పార్టీని, ఒడిషా లాంటి రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలనూ కలుపుకుని ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేసి, ప్రజలకు ఆదాయాన్నిచ్చే కొత్త పాలనను భారతదేశంలో ఆవిష్కరిస్తానని చెప్పారు.

15వ ఆర్థిక సంఘానికి నోటిమాటగా చెప్పిన అంశాల్లోనూ, లిఖితపూర్వకంగా ఇచ్చిన నివేదికలోనూ నూతన ఫెడరల్ భారతదేశ నిర్మాణానికి కొన్ని సూచనల్ని కూడా కేసీఆర్ చేశారు. ఇది ఆహ్వానించదగ్గ ప్రయత్నమే.

ఎందుకంటే, దేశంలో మితిమీరిన కేంద్రీకరణ వల్ల పాలన, రాజకీయం రెండూ తీవ్రంగా నష్టపోతున్నాయి. దేశ విభజన సమయంలో ఇచ్చిన అధికారాన్ని వదులుకోవటానికి ఆ తర్వాత ఢిల్లీలో గద్దెనెక్కినవారెవరికీ మనసొప్పు లేదు. వీలైనంత ఏకపక్షంగా పెత్తనం చెలాయించాలనే ప్రయత్నించారు.

దేశంలో ఉన్న రకరకాల ప్రజలు, వారి భిన్న సంస్కృతుల వల్ల గంపగుత్తగా దేశం మీద పూర్తిస్థాయి ఆధిపత్యం చెలాయించటం ఎవరికీ అలవి కావటం లేదుగానీ.. ఇందిరాగాంధీ హయాం నుంచి ఆ నియంతృత్వ ధోరణులకు ప్రయత్నాలైతే కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా నరేంద్రమోదీ హయాం వచ్చేసరికి సాంకేతిక పరిజ్ఞానం విస్తరించటంతో.. సాంకేతికతను, ప్రపంచీకరణను అడ్డంపెట్టుకుని దేశమంతటినీ మూస పోసినట్లు ఒకే విధంగా తయారుచేసేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. అన్ని రాష్ట్రాలకూ, అన్ని రకాల ప్రజలకూ ఒకే పద్ధతిని అమలు చేసేందుకు ప్రయోగాలు చేస్తున్నారు, రాజ్యాంగంలోని లొసుగుల్ని ఉపయోగించుకుంటున్నారు.

లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్

నారాయణ్ ఎన్నో ఏళ్లుగా చెబుతున్నట్లు.. 'ఏకత్వం అంటే మూసపోసినట్లు దేశమంతా ఏకరూపంతో ఉండటం కాదు'. దేశ వైవిధ్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తే అది భారీ రాజకీయ, పాలనా కల్లోలానికి దారి తీసి ప్రజల్లో రాజకీయాలు, ప్రజాస్వామ్యం పట్ల నమ్మకమే లేకుండా చేస్తుంది. ఎంత టెక్నాలజీ ఉన్నా ఢిల్లీ నుంచి ప్రధానమంత్రి కేరళలోనో, ఆంధ్రప్రదేశ్‌లోనో, అరుణాచల్‌ప్రదేశ్‌లోనో, రాజస్థాన్‌లోనో ఉండే ఓ గ్రామంలోని ప్రజల సమస్యలను తీర్చగలడా? స్థానిక పరిస్థితులు, జీవనవిధానానికనుగుణంగా అక్కడి ప్రజలు, ప్రభుత్వాలే పరిష్కారాల్ని నిర్ణయించుకుని అమలు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలను పర్యవేక్షిస్తూ అక్కడ తప్పు జరిగితే చర్యలు తీసుకోవాలి. పైగా, డెబ్బై ఏళ్లు దాటిన స్వతంత్ర పాలన తర్వాత రాష్ట్రాల్లో చాలావరకు స్వయంసమృద్ధి వచ్చింది. లక్ష కోట్లు దాటిన భారీ ప్రాజెక్టులను సైతం రాష్ట్రాలు సొంతంగా కట్టేసుకుంటున్నాయి. పరిణతి కూడా పెరిగింది. రాష్ట్రాల్లో, నగరాల్లో లేని గొప్ప నాయకత్వ లక్షణాలు ఢిల్లీలో ఏలికలుగా వెలుగొందుతున్నవారికి ఏమున్నాయి? ఈ నేపథ్యంలో రాష్ట్రాలకు మరిన్ని అధికారాలను అందించేలా, అధికారాన్ని ఢిల్లీ నుంచి వికేంద్రీకరించేలా కేసీఆర్ ప్రతిపాదించటం మంచి పరిణామం.

అయితే, ఇప్పుడు ఢిల్లీలో మళ్లీ గద్దెనెక్కిన నరేంద్రమోదీ ప్రభుత్వానికి సొంతంగానే లోక్‌సభలో 303 సీట్ల మెజారిటీ వచ్చింది కాబట్టి తెరాస లాంటి ప్రాంతీయ పార్టీల ఫెడరల్ ఫ్రంట్‌ను పట్టించుకునే అవకాశాలు దాదాపు లేవు. కేసీఆర్ పార్టీ కంటే ఏపీలో జగన్ పార్టీకి ఎక్కువ సీట్లు వచ్చాయి. 9 సీట్ల కేసీఆర్ ఫెడరలిజం పేరుతో మోదీకి వ్యతిరేకంగా మోహరిద్దామనుకున్నా ఎవరూ కలిసొచ్చే అవకాశం లేదు. అయితే ఇప్పుడున్న ప్రజాస్వామ్య సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు ఉన్న పరిణతి ఫెడరలిజం అత్యవసరం. ఉన్న రాజకీయ పరిస్థితుల్ని – దేశ తక్షణావసరాల్ని సమన్వయం చేయటం ఎలా?

ఈ సంక్షోభానికి విరుగుడు సమర్థత, చురుకుదనం గల యువతలోనే ఉంది. వారిని పాలనలో, రాజకీయాల్లో భాగస్వాములు చేసే పని ప్రధానంగా స్థానికంగా సమస్యల మీద పనిచేయటం నుంచే మొదలవ్వాలి. అందువల్ల ఫెడరల్ ఫ్రంట్ విషయంలో తానొకటి తలిస్తే ఇంకోటి జరిగినా కూడా సంకల్పాన్ని విడువకుండా కేసీఆర్ తన ప్రయత్నాల్ని కొనసాగించటం అవసరం.

ఈ ఎన్నికల్లో కులం, మతం, ప్రాంతం, డబ్బు, తాత్కాలిక తాయిలాల పథకాల చుట్టూ జరిగిన ఎన్నికలు చూశాక.. జాతీయస్థాయిలో నరేంద్రమోదీ ఎంత సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా, ఏపీలో జగన్‌కి ఎంత అద్భుత మెజారిటీ లభించినా ప్రజాస్వామ్యం బాగుందని ఎవరూ అనుకోరు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు అవసరమైన మార్పులు తీసుకురాకుండా ఎల్లకాలం ఎవరూ ఆపలేరు. అలా మొండిగా వెళ్తే మోదీ పీఠం కూడా కదులుతుంది. అందువల్ల మోదీ ప్రభుత్వమే చెప్పిన సహకార సమాఖ్య నినాదాన్ని అడ్డం పెట్టుకుని లోక్‌సత్తా లాంటి సంస్థలు, పార్టీల సహకారంతో కేసీఆర్ ఫెడరలిజం విస్తరణకు నెమ్మదిగానైనా ప్రయత్నాల్ని చేస్తుండాలి. కానీ ఆ లక్ష్యం నెరవేరేలోగా సొంత రాష్ట్రం తెలంగాణలో ఆయన చేయాల్సింది చాలా ఉంది. ఈ పాలనా కృషి కూడా బలమైన ఫెడరల్ ఇండియా లక్ష్యాల్లో భాగమే.

తెలంగాణలో గతేడాది చివర్లో ముందస్తు ఎన్నికల కోసం అసెంబ్లీని రద్దు చేయటానికి ముందు ఎలా ఉందో ఇప్పుడు కూడా పాలన అలాగే ఉంది. విద్య, ఆరోగ్యం, ఉపాధి, వ్యవసాయోత్పత్తుల ధరలు, చట్టబద్ధపాలన, మౌలిక వసతులు వంటి ప్రధాన విషయాల్లో తొలి ఐదేళ్ల పాలనలోని వైఫల్యాలు అదేరీతిలో వెక్కిరిస్తున్నాయి. ఆర్థిక పరిస్థితి ఇంకా దిగజారి అప్పులు కుప్పలవుతున్నాయి. ఎన్నికలు ముగిశాయి, మళ్లీ 5 ఏళ్ల దాకా మీరు ఏమీ చేయలేరు అన్నట్లు కాలక్షేపం చేస్తూ నచ్చినప్పుడు స్పందిస్తానంటే దేశం సంగతి అలా ఉంచి ముందు రాష్ట్రం తీవ్రంగా నష్టపోతుంది.

మచ్చుకు చదువుల గురించి మాట్లాడుకుందాం.

రాష్ట్రంలో అత్యధికులుగా ఉన్న సామాన్య ప్రజల విషయంలో చదువులు భ్రష్టుపట్టిపోయి నైపుణ్యాలు, విలువలు లేని డిగ్రీలు చేతికి వచ్చి ఎందుకూ పనికిరావటం లేదు. ముఖ్యంగా పాఠశాల విద్య సాధారణ ప్రమాణాల్లోనే రాష్ట్రం దేశంలో వెనుకబడిన రాష్ట్రాల సరసన ఉంది. నాణ్యతా ప్రమాణాల్లోనైతే మరీ అధ్వాన్నం. హైస్కూలులో చదివే పిల్లల్లో అనేకమందికి గడియారం చూసి టైం చెప్పటం కూడా చేతగావటం లేదు. పాఠశాల విద్యారంగాన్ని బాగు చేయటానికి కేంద్ర విద్యాహక్కు చట్టంలో మార్పులు కొన్ని అవసరమున్న మాట వాస్తవం. కానీ ఈలోగా కూడా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకోవచ్చు.

బోధన, అభ్యసన సామర్థ్యాల అంచనా, పరీక్షల నిర్వహణ వంటి అంశాల్లో మెరుగుపరిచే అవకాశాలు అనేకం ఉన్నాయి. తెలంగాణలోని పలు గురుకుల పాఠశాలల్లో మంచి చదువే అందుతోంది. కానీ వాటి ద్వారా తయారయ్యే విద్యార్థులు మొత్తం

రాష్ట్రంలోని స్కూలు విద్యార్థుల సంఖ్యలో చాలా తక్కువ శాతం మాత్రమే ఉంటారు. అందువల్ల ప్రభుత్వ పాఠశాలలను బాగు చేయటం, ప్రభుత్వ-ప్రయివేటు పాఠశాలల్లో తమకు నచ్చినదాన్ని ఎంచుకునే అవకాశం తల్లిదండ్రులకే ఇచ్చి ఫీజును మాత్రం ప్రభుత్వమే చెల్లించటం మీద దృష్టి పెట్టాలి. అన్ని స్కూళ్లలో విద్యలో భారాన్ని తగ్గించి నాణ్యతను, పోటీని, పర్యవేక్షణను పెంచితే.. కేవలం కొద్దిమందికి కాకుండా పిల్లలందరికీ మంచి ప్రమాణాల స్కూలు చదువును అందించవచ్చు. ఇందుకు అదనంగా పెద్ద ఖర్చు కూడా ఏమీ అవదు. విద్యారంగానికి రాష్ట్రం ఇప్పుడు చేస్తున్న ఖర్చుతోనే ఆ పని చేయొచ్చు.

విద్యలో నాణ్యతను పెంచటంలో కీలకమైన ఉపాధ్యాయుల నైపుణ్యాల గురించి ఒకింత చర్చిద్దాం.

రోజుకూలీతో చాలా సామాన్య జీవితం గడుపుతూ కూడా తమ పిల్లలకు మంచి చదువు రావాలని ఆశపడుతున్న తల్లిదండ్రులు రాష్ట్రంలో అనేకమంది ఉన్నారు. మెరుగైన చదువు వస్తుందేమోనన్న ఆశతో వారు తమ పిల్లల్ని ప్రైవేటు స్కూళ్లకు పంపటానికి వెనుకాడటం లేదు. ఇందుకోసం తమ తప్పనిసరి అవసరాలను సైతం తగ్గించుకోవటంతోపాటు అప్పులు కూడా చేస్తున్నారు. ఏదో కాస్త పేరున్న స్కూలుకు పంపితే చదువొస్తుంది అనుకుంటున్నారు తప్పితే, అక్కడ ఎలాంటి చదువు చెబుతున్నారో అర్థం చేసుకునే శక్తి వారికి లేదు. విద్యాప్రమాణాలు బాగాలేవని ఇటీవల ఘోషించేవారి సంఖ్య పెరుగుతుండటంతో కొందరు తల్లిదండ్రులు ఇటీవల ఈ విషయాన్ని లేవనెత్తుతున్నారుగానీ.. ఈ ప్రమాణాలు బాగుండాలంటే ఏం చేయాలో వారు కూడా నిర్దిష్టంగా చెప్పలేకపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే సరైన ఉపాధ్యాయ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అదే సరైన పునాది.

నేను, మావారు అధ్యాపకులుగా పనిచేస్తున్నకాలంలో గిరిజన బాలల సంక్షేమ పాఠశాల ఉపాధ్యాయుల ఎంపిక కోసం ప్రభుత్వ ఇంటర్వ్యూలకు మమ్మల్ని నియమించారు. కనీసం 50% అర్హతలున్నా వారిని సెలక్ట్ చేయవచ్చునన్నారు. తీరా చూస్తే 25% అర్హత ప్రమాణాలున్నవారు కూడా లేరు. మాతోపాటు ప్రముఖ విద్యాసంస్థల ఫౌండర్ రామయ్యగారు కూడా ఉన్నారు. ఇది ఈ మధ్య కొన్ని సంవత్సరాల క్రితమే జరిగిన ఘటన. మేము విషయాన్ని సంబంధిత ప్రతినిధికి తెలియజేశాం. 'నిజమే కానీ.. ఎవరో ఒకరు అక్కడ అవసరం కదా, ఉన్నవారిలో కాస్త మెరుగైనవారిని ఎంపిక చేయండి' అన్నారు. విధిలేక సెలక్ట్ చేశాం. అంతేకాదు, వాళ్లకి ఇంటి దగ్గర కూడా మేము ట్రైనింగ్ ఇవ్వాల్సి వచ్చింది. ఇదంతా చెప్పటం.. ఉపాధ్యాయుల్లో నాణ్యత వెనక ఎంత వైఫల్యం, ఎన్ని లొసుగులు ఉన్నాయో తెలియజెప్పటం కోసం!

గిరిజనుల ఎంపికలో తలెత్తిన స్థాయిలో సమస్య మిగిలిన అభ్యర్థుల విషయంలో రాకపోవచ్చు. కానీ స్థూలంగా పెద్ద మొత్తాలలో జీతాలు ఇస్తూ కూడా అందుకు ప్రాథమిక అర్హతలు, ఆ రంగం పట్ల అవగాహన, టీచింగ్ పట్ల తపన, ఆర్తి లేనివారినే ఎక్కువగా టీచర్లుగా నియమించాల్సి వస్తోంది. ఇది కాక నకిలీ టీచర్ల బెడద. వీటన్నిటినీ రాష్ట్ర ప్రభుత్వమే సరిదిద్దవచ్చు.

అలాగే ఆరోగ్య రంగంలో కేసీఆర్ కిట్లు వంటి సంచలన ప్రచారాంశాలే తప్ప ఆ రంగాన్ని బాగు చేయాలన్న దృష్టి ఇంతవరకూ కనిపించలేదు. కేంద్ర నిధుల్ని కూడా వినియోగించకుండా మురగబెడుతున్నారు. పత్రికల్లో, టీవీల్లో హెడ్‌లైన్ వార్తల్ని మేనేజ్ చేయవచ్చేమోగానీ, ప్రజల వాస్తవ అనుభవాల్ని ఏమార్చలేరు. వారి ఆకాంక్షలు పెరుగుతున్నాయి. ఇంకా పెరిగి తమ పేదరికానికి, తమకు ఎదిగే అవకాశాలు లేకపోవటానికి ప్రభుత్వాలు సరైన విద్య, వైద్యం వంటివి అందించకపోవటమే కారణమని గుర్తించి ప్రశ్నించటం మొదలుపెడితే నేతలు, పాలక పక్షాలు ఎక్కడుంటాయి?

ప్రజల్లో అవగాహన పెంచుతూనే, వారిలో మార్పు వచ్చే దాకా ఆగకుండా పాలకులు సరైన, ఆచరణీయమైన మార్పుల్ని చేపడితే, ఎన్నో కోట్ల మంది జీవితాల్లో విషాదాల్ని, బాధల్ని నివారించవచ్చు.

తమను తాత్కాలిక భావోద్రేకాలకు, ప్రలోభాలకు గురిచేసి వాడుకున్న నాయకులెవరో, తమకు నిజమైన ఎదిగే అవకాశాల కోసం పోరాడిన నాయకుడెవరో ఈవేళ కాకపోతే రేపైనా ప్రజలు గుర్తించకమానరు. ఫలానా ఎన్నికల్లో గెలిచారు, తెలంగాణకు మొదటి, రెండో ముఖ్యమంత్రిగా ఉన్నారు అని ఫుట్‌నోట్స్‌లో మిగిలిపోయే నాయకుల జాబితాలో కాకుండా, ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలున్న ప్రజా తెలంగాణను నిర్మించేందుకు కృషి చేసిన గొప్ప నాయకుల జాబితాలో నిలవాలన్నదే కేసీఆర్ ఆకాంక్ష అని మా నమ్మకం. అందుకే ఫెడరల్ ఫ్రంట్ కోసం దీర్ఘకాలిక, మధ్యకాలిక కృషి చేస్తూనే, తెలంగాణలో విద్య, ఆరోగ్యాన్ని బాగు చేసేందుకు, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలకు 'పౌర సేవల' చట్టం తెచ్చేందుకు, రాష్ట్ర బడ్జెట్ నుంచే స్థానిక ప్రభుత్వాలకు తలసరి నిధుల కేటాయింపునకు, చట్టబద్ధ పాలనకు, వ్యవసాయోత్పత్తులకు లాభసాటి ధరలు లభించేలా చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం. □

# జగన్ - చంద్రబాబు - మన పన్నుల డబ్బు

- వి. సత్యనారాయణ, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కాంటాక్ట్: 99124 15128, taxpayers365@gmail.com




ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని తెలుగుదేశం పార్టీ ఘోరపరాజయానికి కారణాలనేకం.

2014లో చంద్రబాబు గారికి ప్రజలు పరిపాలనకు కావలసిన సీట్లను అందించారు. అంత చక్కటి అవకాశాన్ని ఇచ్చినప్పటికీ ఆయన ఎమ్మెల్యేలకు, అధికారులకు దోచుకోవడానికి పూర్తి స్వేచ్ఛని .. ప్రజలకు అడిగినా అడక్కున్నా తాత్కాలిక తాయిలాల్ని ఇస్తూ పరిపాలనను పంచుడు కార్యక్రమంగా మార్చేశారు. విభజనతో ఆర్థికంగా నిలదొక్కుకోవటానికి తడబడుతున్న నూతన ఆంధ్రప్రదేశ్.. స్వతంత్ర భారతదేశంలోనే ఎన్నడూలేని స్థాయిలో తాయిలాల్ని అమలు చేయటం దిగ్భ్రాంతిని కలిగించకమానదు. అదేమంటే, అందరినీ సంతృప్తస్థాయిని మించి సంతృప్తిపరిచాం గదా, ప్రచారంలో ముందున్నాం గదా గెలిచేస్తాం, ఎలాగోలా గెలిస్తే అంతా బాగున్నట్లే గదా అని చెబుతూ వచ్చారు. వందిమాగధులు, టెక్నాలజీ కూడా బాబును బాగా నమ్మించాయి. దీనికితోడు వైఎస్ జగన్ పార్టీలోని 23 మంది ఎమ్మెల్యేలను తెదేపాలోకి లాగేసుకున్నారు (కొనుక్కున్నారు). తెలంగాణలో తను కేసీఆర్ ప్రభుత్వాన్ని దెబ్బతీయటానికి ప్రయత్నించినట్లు, ఏపీలో జగన్ కూడా తెదేపా ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి తన ప్రభుత్వాన్ని పడగొడతారేమోన్న అభద్రతతోనో.. ప్రతిపక్షాన్ని బలహీనపరిస్తే 2019లో లోకేష్‌కు కూడా ఈజీగా ఉంటుందున్న అంచనాతోనో వైకాపా ఎమ్మెల్యేలను, కొందరు ఎంపీలను కూడా కలిపేసుకున్నారు. ఎన్నికల సమయం వచ్చాక గానీ బాబు గారికి వాస్తవం బోధపడలేదు. మితిమీరిన పుత్రప్రేమతో, నూతనత్వం పట్ల అభద్రతతో, వయసుతో పెరిగిన అహం, కీర్తికండూతితో తాను ఎంత పేలవంగా, నిజాల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందీ ఆయనకు క్రమంగా అర్థం కాసాగింది. దీంతో హడావుడిగా పసుపు కుంకుమల్ని, సుఖీభవల్ని ఎత్తుకున్నారు. అయినా షాక్ వేవ్ ఆగలేదు. తెదేపా చరిత్రలోనే దారుణ పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మళ్లీ టికెట్లివ్వటం, సరైన పొత్తుల వ్యూహం లేకపోవటం, ఎన్నికల వార్ రూం నిర్వహణ కూడా అధ్వాన్నంగా ఉండటం వంటి ఎలక్షనీరింగ్ తప్పిదాలున్నా.. చంద్రబాబు తమను నిరాశపరిచారన్న భావన ప్రజల్లో అంతర్లీనంగా ఏర్పడటం ఆయన ఓటమికి మౌలిక కారణం.

మరి ఇన్ని వైఫల్యాలున్నా చంద్రబాబు కన్నా జగన్ బెటరా?.. 2014లో అయితే కచ్చితంగా కాదనే జనం అనుకున్నారు. చంద్రబాబుకు ఆల్టర్నేటివ్ లేదు అనే భావన (టీనా) బాబుకు ఎక్కువగా కలిసొచ్చింది. 2019లో కూడా అదే పనిచేస్తుందని బాబు బాగా విశ్వసించారు. ఎన్ని అవరోధాలున్నా టీనా ఫ్యాక్టర్ మళ్లీ తనను గెలిపిస్తుందని ఆయన నమ్ముకున్నారు. కానీ జనం అలా అనుకోలేదు. ఈసారి చంద్రబాబుకి, జగన్‌కి తేడా లేదని అనుకున్నారు. తేడా లేకున్నా కూడా.. రాష్ట్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో బాబే మళ్లీ ముఖ్యమంత్రి అవటం మేలన్న వాదనలు కూడా బలంగానే వినిపించాయి. బాగా పరిచయస్తులైన హైదరాబాద్ సిటీ బస్సు కండక్టరొకాయన ఉన్నారు. తెలంగాణ వాసే. ఆయనైతే ఇప్పుడు కూడా జగన్ కంటే బాబే బెటర్ అని ఎన్నికలకు ముందు ఒక పట్టిక వేసి పోల్చి మరీ తేల్చారు. చంద్రబాబు వల్ల ఎమ్మెల్యేల దోపిడీ, కొందరు కమ్మ కులస్తుల ఆగడాలు పెరిగిపోయాయి అనుకున్నా కూడా.. మిగిలిన అన్ని కోణాల్లో జగన్ కన్నా బాబే మేలు అని ఆయన విశ్లేషించారు. ఆయన వాదన విన్నాక.. కరెక్టే కదా అనిపించింది.

బాబుకి, జగన్‌కి తేడాలేదని కొంతకాలం క్రితం నుంచి అనుకోవటం మొదలుపెట్టినవారిలో కూడా తొలుత సంశయలాభం బాబు వైపే ఉండేది. కానీ

పాదయాత్రలో జగన్ పడ్డ కష్టం, జగన్‌ని తప్పు చేస్తే ఇప్పటిదాకా నిరూపించి శిక్షించలేని వ్యవస్థలు, జగన్‌పై అనేక ఆరోపణల కేసులను ఫైల్ చేసిన సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ కూడా ఏమీ ఎరగనట్లు కొత్త రాజకీయమంటూ జనసేనలో చేరి ఎంపీగా గెలవటానికే పరిమితం కావటం వంటివన్నీ ప్రజల్లో జగన్ పట్ల ఉన్న ప్రతికూలతని తగ్గించాయి. తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు వ్యాపారంలో దివాలా తీసిన జగన్.. తండ్రి ముఖ్యమంత్రయ్యాక దేశంలోనే అత్యంత విజయవంతమైన బిజినెస్ మేగ్నెట్‌గా ఎలా మారారన్న సింపుల్ పాయింట్ మరుగునపడింది. 'జగన్‌కి ఒక్క ఛాన్స్ ఇచ్చి చూద్దాం' అనుకున్నారు. ముఖ్యంగా యువత బాగా కనెక్ట్ అయ్యారు. యూత్‌లో చాలామందికి జగన్ నేపథ్యం, రాజశేఖర్ రెడ్డి రాజకీయ ప్రస్థానం కూడా పెద్దగా తెలీదు. దీంతో చంద్రబాబు ఓటమి ఖరారయింది. తెదేపా ఎలక్షనీరింగ్ వైఫల్యం .. తెలంగాణ నుంచి, జాతీయ స్థాయి నుంచి జగన్‌కు రకరకాల రూపాల్లో వచ్చిన సహాయసహకారాలతో పరాజయం సునామీ స్థాయి విధ్వంసాన్ని సృష్టించింది. దాన్నుంచి తెదేపా తేరుకుంటుందా, ఆ స్పేస్‌లోకి రావటానికి బీజేపీ ప్రయత్నిస్తుందా అనేవి మనం పెద్దగా పట్టించుకోనక్కర్లేదు. తమ పార్టీ నుంచి 23 మంది ఎమ్మెల్యేలను లాక్కున్నందుకు దేవుడు తెదేపాకు 23 మంది ఎమ్మెల్యేలనే ఇచ్చాడని, అది కూడా మే 23నే ఇచ్చాడని అంటూ, 23 అంకె చుట్టూ పాపపుణ్యాల లెక్కను జగన్ మహిమాన్వితంగా చెప్పుకొచ్చారు (ఫిరాయింపులపై తన కార్యకారణ లెక్క ప్రస్తుతం తన మిత్రులుగా ఉన్న కేసీఆర్, మోదీ పార్టీలకు కూడా తగులుతుందని జగన్ మర్చిపోయినట్లుంది). రాజ్యాంగం ద్వారా మనం చేయాల్సిన పనుల్ని దేవుడికి అప్పజెప్పే ఇలాంటి వ్యాఖ్యల గురించి కూడా మనకనవసరం. అధికార పార్టీగా వైకాపా, ప్రతిపక్షంగా తెలుగుదేశం మన జీవితాల్ని మెరుగుపరచటానికి ఎంత నిర్మాణాత్మకంగా పనిచేస్తాయో అన్నది మాత్రమే మనం నిరంతరం గమనించాల్సింది.

తెదేపా బలహీనంగా ఉంది కాబట్టి, ఫిరాయింపులకు వ్యతిరేకంగా వైకాపా గట్టిగా గళం వినిపిస్తోంది కాబట్టి.. తెదేపా ఎమ్మెల్యేలను లాక్కునే పనిని ఇప్పట్లో ఆ పార్టీ చేయకపోవచ్చు. ప్రజాస్వామికంగా ఇది మంచి పరిణామం. అలాగే అసెంబ్లీలో తక్కువ సభ్యులున్నా తెదేపా ఎంత ప్రభావశీల ప్రతిపక్షంగా వ్యవహరిస్తోందో కూడా నిశితంగా గమనించాలి. వీటన్నిటితోపాటు తన మీదున్న ప్రతికూల భావాలను చెరిపేసుకోవటానికి ముఖ్యమంత్రిగా జగన్ చేసే ప్రయత్నాలు రాష్ట్రంలో సుపరిపాలనకు ఏమేరకు ఉపయోగపడుతోందీ బేరీజు వేసుకుంటుండాలి. జగన్, చంద్రబాబు ఇద్దరూ తాయిలాలనే ఎక్కువగా నమ్ముకున్నారు. జగన్ పార్టీ వాళ్లు కూడా ఎన్నికల్లో బాగా ఖర్చు పెట్టారు. వసూలు చేసుకోవటానికి ఏ ఛాన్సునీ వారు వదులుకునే అవకాశం ఉండదు. ఓటుకు రూ.2,000 నోట్లను పంచిన నేతలు నిజాయతీగా మనకు సేవ చేస్తారా? కాబట్టి.. 'ప్రభుత్వోద్యోగులకు జీతాలు – ప్రజలకు తాయిలాలు – తమకు అవినీతి సొమ్ము' అనే ఫార్ములా పాలనకు ఇప్పుడు కూడా ఏపీలో అవకాశాలు బాగా ఎక్కువగానే ఉన్నాయి. దీన్ని గమనిస్తూ.. పాలన సక్రమంగా, పారదర్శకంగా చేయకపోతే ఊరుకోం అని స్పష్టంగా తెలియజేస్తూ మనం ప్రభుత్వాన్ని పనిచేయిస్తుండాలి.

ఈ క్రమంలో ఒక మౌలికమైన ప్రశ్నను మనం కూడా తేల్చుకోవాలి. లేకుంటే మన పోరాటమంతా ఓటింగ్, షూటింగ్‌లతో కొయ్యగుర్రం మీద స్వారీలాగానే ఉంటుందిగానీ ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పాలన బాగుపడదు.

'మన డబ్బుల్ని తాత్కాలిక తాయిలాలకు, ఎన్నికలప్పుడు ఓటుకు నోట్లు ఇవ్వడానికి ఖర్చుచేయాలా? లేక అంతకు అనేకరెట్లు మనకు మేలు చేసే సరైన పాలన కోసం ఖర్చు చేయాలా? అనేది మనం స్పష్టంగా తేల్చుకోవాలి (ఎన్నికలకు ముందు జగన్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలోని పథకాలకు రూ.56,000 కోట్లు ఖర్చవుతాయని అంచనా).

అవును! ఆ డబ్బంతా మనదే.

నేనిచ్చా, నేనిస్తున్నా అని తమ జేబుల్లో నుంచి ప్రజలకేదో ఇస్తున్నట్లు నాయకులు దానకర్ణుల్లా మాట్లాడుతున్నారు. మనం కూడా ఫ్రీగా వచ్చిందని తీసేసుకుంటున్నాం. కానీ వాళ్లిచ్చే తాయిలాలు, ఓటుకు నోట్లు అన్నీ మన డబ్బుతో ఇచ్చినవే. అది మన డబ్బే. సబ్బుబిళ్ల, టూత్‌పేస్టుపై నుంచి జీతాలు, వ్యాపార ఆదాయాలపై వరకూ మనలో పేదవాడు, సంపన్నుడు అనే తేడా లేకుండా అందరి దగ్గర్నుంచీ వసూలు చేస్తున్న పన్నుల డబ్బుతో ప్రభుత్వాలకు ఆ ఆదాయం వెళ్తోంది. ఆ డబ్బు మొత్తం మనదే! ఆ డబ్బును మనం వ్యక్తిగతంగా చేసుకోలేని ఉమ్మడి అవసరాలను సరిగా చేయటానికి వారికి ఎన్నికల ద్వారా బాధ్యతలు అప్పజెప్పామంతే! కానీ ఆ డబ్బును దేనికి ఉపయోగించాలి అనే దాని మీద వాళ్లు మనకి దెబ్బేస్తున్నారు. మన డబ్బుల్ని మనకు ఉపయోగపడే విషయాల మీద కాకుండా, మనం బలహీనతకు లోనై ఆలోచన లేకుండా ఆవేశంతో వారికి ఓటేసే పథకాల మీద ఖర్చు పెడుతున్నారు. ఇందులో పనిలోపనిగా వారు కూడా దోచేస్తున్నారు. కొంత

ఎన్నికలప్పుడు ఓటుకు నోటులా ఇస్తున్నారు. మన పన్నుల డబ్బుని ఎలా సద్వినియోగం చేయాలో తెలుసుకుని వాటి కోసం గట్టిగా డిమాండ్ చేస్తుంటేనే సరైన పాలన సాధ్యమవుతుంది. చంద్రబాబు స్థానంలో ఇప్పుడు జగన్ వచ్చినా, మనం మాత్రం అప్రమత్తంగా మన పన్నుల డబ్బు ఎలా ఖర్చవుతోంది? అని ఎప్పుడూ గమనిస్తుండాలి. ఎలా ఖర్చు చేయాలో డిమాండ్ చేస్తుండాలి. తాయిలాలకే ఓట్లు పడవని ఇటీవల చంద్రబాబువిషయంలో ప్రజలు హెచ్చరించారు. కానీ తాయిలాలతో సంబంధం లేకుండా తాము సరైన ఎజెండాకు, నాయకత్వానికి, పార్టీకి ఓటు వేస్తామన్న గ్యారంటీనైతే ఏపీ ఓటరు ఇవ్వడం లేదు. కాబట్టి ప్రజలకు ఈ విషయాలపై అవగాహన కల్పించి లీడ్ చేయటానికి కొంతమంది సామాజిక నాయకులు కావాలి. మన పన్నుల డబ్బు వ్యయాన్ని ప్రతి దశలోనూ థర్డ్ ఐ (మూడో కన్ను)తో వీరు గమనిస్తుండాలి.

మన పన్నుల డబ్బుల్ని ప్రజలు ఎదగటానికి ఉపయోగపడే చదువు, ఆరోగ్యం, పౌష్టికాహారం, ఉపాధి, మౌలిక సౌకర్యాల కోసం ఉపయోగిస్తారా లేక రేపనేదే లేనట్లు చేసే తాత్కాలిక తాయిలాలకు ఖర్చు చేస్తారా? వీటిలో అవినీతికి పాల్పడటం ద్వారా మన వద్ద నుంచి దోచిన సొమ్ముతో మళ్లీ మనకే ఓటుకు నోటులా ఇస్తారా?.. ఈ విషయాలపై ప్రజలు అవగాహనతో వ్యవహరించేలా చేయగలిగితే సామాజిక నాయకులు పెద్ద విజయం సాధించినట్లే. ఎందుకంటే- ప్రజలకు తాము కట్టే పన్నుల డబ్బుకి-తమ ఓటుకి మధ్య సంబంధం అర్థమవటాన్ని మించి ప్రజాస్వామ్యానికి పెద్దరక్షణ ఇంకోటి ఉండదు. □

# ప్రత్యక్ష ఎన్నికల కోసం విజయనగరంలో అఖిలపక్ష సమావేశం






రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్లో అన్ని స్థాయిల్లో ప్రత్యక్ష ఎన్నికలు అవసరమని, అందుకు అఖిలపక్షంగా పోరాటం చేద్దామని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. పార్టీ జిల్లా ప్రతినిధి ఆకుల దామోదర్ అధ్యక్షతన విజయనగరం గురజాడ పబ్లిక్ స్కూల్లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి టంగుటూరు అంజయ్య ప్రత్యక్ష ఎన్నికలను ప్రోత్సహించారని, ముఖ్యమంత్రిగా ఎన్.టి రామారావు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పురపాలక, నగరపాలక ప్రభుత్వాలకు ప్రత్యక్ష ఎన్నికలు జరిపించారని అన్నారు. అయితే తదుపరి ముఖ్యమంత్రులు వీటిని రద్దు చేసి అడ్డదారిలో అధికారం కోసం పరోక్ష ఎన్నికలను మళ్లీ తెర లేపారన్నారు. పంచాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు మాట్లాడుతూ, ప్రస్తుత ఎన్నికల విధానం లోపభూయిష్టంగా ఉండటం వల్ల అనేక అక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రత్యక్ష ఎన్నికల విధానం అమలు జరిగితే, స్థానిక ప్రభుత్వాలు నిధులు, అధికారాలతో బలోపేతమైతే కొత్తతరం నాయకులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం పంచాయతీల్లో పాలన పడకేసిందన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ ఎప్పటి నుంచో ఈ మార్పుల కోసం పోరాడుతున్నారన్నారు. ప్రత్యక్ష ఎన్నికలను డిమాండ్ చేస్తూ విజయనగరం నుంచి ప్రజాపోరాటానికి అఖిలపక్షం తీర్మానించింది. ప్రజలు కోరుకుంటున్న ఈ డిమాండ్‌ను ముందుగా పోస్టుకార్డుల ద్వారా ప్రభుత్వానికి తెలియజేద్దామని నేతలు సూచించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి శ్రీనివాస్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పి.వి రమణ, జనసేన ప్రతినిధి బాలు, చాంబర్ జిల్లా అధ్యక్షుడు కె. సత్యం, ఎలియన్స్ క్లబ్ అధ్యక్షుడు గురుప్రసాద్, బీసీ సంఘాల ప్రతినిధులు గొర్లె సూరిబాబు, చోడి ఆదినారాయణ, ప్రజాసంఘాల ప్రతినిధులు భుంగ భానుమూర్తి, బసవ సూర్యనారాయణ, రామవరపు పైడిరాజు, గంట్రేటి సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు, సత్యనారాయణ, శ్రీను, లోక్‌సత్తా పార్టీ సీనియర్ నేతలు ప్రసాద్, సత్యం, గురునాథం, రాజు, దామోదర్, విష్ణు, రాజారావు, భాస్కర్, చంద్రరావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు. □

# రాష్ట్రాలకు మరిన్ని అధికారాలనివ్వాలని అడిగిన తెలంగాణ




**15వ** ఆర్థిక సంఘానికి తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన వివిధాంశాలను ఇటీవల లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు బహిరంగ సభల్లో ప్రకటించారు. ఒకప్పుడు మనకంటే పేదగా ఉన్న దేశాలు నేడు అద్భుత ప్రగతిని సాధించి మనకంటే ముందు ఉన్నాయని, మన ఆలోచనల్లోని లోపాలే మన ఎదుగుదలకు అవరోధాలుగా ఉన్నాయని ఈ సందర్భంగా అన్నారు. చైనా, జపాన్ తదితర దేశాల అద్భుత ప్రగతిని ఆయన ఉటంకించారు. మన దేశం వైఫల్యాలను అధిగమించటానికి 'జాతీయస్థాయిలో దృష్టి సారించాల్సిన వివిధాంశాలను' రానున్న ఆర్థిక సంఘానికి ఫెడరల్ స్ఫూర్తికనుగుణంగా వివరించామన్నారు.

జాతీయస్థాయిలో చేపట్టాల్సిన చర్యల్ని సూచిస్తూ 15వ ఆర్థిక సంఘానికి తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన కొన్ని అంశాలు:

- దేశంలో వివిధ సమకాలీన అంశాలను పరిష్కరించడానికి కేంద్రంలోని ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదు. పాక్షికంగా, లేదంటే తాత్కాలికంగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు. రెండు రాష్ట్రాలు సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చునేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిలువెత్తు నిదర్శనం.
- దేశంలో 40 కోట్ల ఎకరాల సాగుభూమి ఉండగా.. 70 వేల టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. 40 వేల టీఎంసీలతో దేశంలోని వ్యవసాయ భూమి అంతటికీ సాగునీటిని అందించవచ్చు. గత 70 ఏళ్లలో 5.5 కోట్ల ఎకరాలు.. అంటే కేవలం 14 శాతం భూమికే సాగునీటిని అందించారు. ఇందుకు లోపభూయిష్టమైన వ్యవస్థలు, కాలం చెల్లిన చట్టాలు, ఏళ్ల తరబడి కొనసాగుతున్న అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలే కారణం.
- సంప్రదాయ ఆర్థిక విధానాలకు స్వస్తి చెప్పి.. కొత్త విధానాలతో ముందుకు పోవడంలో కేంద్రంలో ఏర్పడిన అన్ని ప్రభుత్వాలూ విఫలమయ్యాయి. 1971 ముందు చైనా జీడీపీ ఆదాయం భారత్



కంటే తక్కువగా ఉండేది. ఈ 25 ఏళ్లలో కొత్త ఆర్థిక విధానాలతో ఆ దేశం గొప్ప ప్రగతిని సాధించింది. ఇప్పుడు భారత్ కంటే చైనా జీడీపీ నాలుగింతలు ఎక్కువ. భారత్ కంటే చిన్న దేశాలైన జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, తైవాన్, మలేషియా, ఇండొనేషియా దేశాలు ఎంతో అభివృద్ధి సాధించాయి.
- మూసపద్ధతిలో ఏటా బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ పోతే ఎలాంటి సత్ఫలితాలు రావు. రాబోయే తరానికి కావాల్సిన కొత్త అభివృద్ధి నమూనాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.
- రాష్ట్రాలకు కేంద్రం మరిన్ని అధికారాలు కల్పించి ప్రోత్సహించకపోతే దశాబ్దాలు గడిచినా దేశ అభివృద్ధి జరగడం

అసాధ్యం. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. 29 రాష్ట్రాల్లో కేవలం 8, 10 రాష్ట్రాలే అభివృద్ధిలో ముందున్నాయి. తమ రాష్ట్రంలోని వనరులను అభివృద్ధి కోసం వినియోగించడంలో రాష్ట్రాలకు పూర్తి అధికారాలు కల్పించాలి. సర్కారియా కమిషన్ ముందు రాష్ట్రాలు వినిపించిన అభిప్రాయం ప్రకారం ఉమ్మడి జాబితాలోని అంశాలపై కేంద్రం (పార్లమెంటు) పెత్తనాన్ని పూర్తిగా తగ్గించాలి. ఉమ్మడి జాబితాలోని అంశాలపై పార్లమెంటు ఏకపక్షంగా చట్టాలు చేస్తోంది. ఉమ్మడి జాబితాలోని విద్య, వైద్యం, విద్యుత్తు, కార్మికుల సంక్షేమం, బ్యాంకింగ్ విధానాలు, అటవీ, క్రిమినల్ చట్టాలు తదితర ముఖ్యమైన అంశాలపై పార్లమెంటు ఏకపక్షంగా చట్టాలు చేయడం సమంజసం కాదు.

- వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, గృహనిర్మాణం, తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాల నిర్వహణ అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలివేయాలి.
- రాష్ట్రాల నుంచి కేంద్రానికి తరలుతున్న పన్ను ఆదాయంలో సింహభాగాన్ని ఆయా రాష్ట్రాల్లోనే ఖర్చు చేయాలి. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు దేశంలో మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేయాలి. ఇతర దేశాలతో పోల్చుకుంటే సరకు రవాణాలో మనదేశం వెనుకబడి ఉంది.
- దేశం అభివృద్ధి చెందాలంటే అవస్థాపనా, మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేయాలి. ఏటా జీడీపీ నుంచి 5 శాతం దాకా ఆదాయాన్ని కేవలం మౌలిక సదుపాయాల అభివృద్ధి పైనే ఖర్చు చేయాలి.
- ఇతర దేశాలకు నల్లధనం రూపంలో తరలిపోయిన ప్రజల ఆదాయాన్ని తిరిగి రప్పించడానికి ప్రాక్టికల్ ట్యాక్స్ అమ్నెస్టీ స్కీంను అమలు చేయాలి. 2016-17లో ఇండొనేషియా అలా రూ. 366 బిలియన్ల నల్లధనం వెనక్కి తెచ్చింది.

# 15వ ఆర్థిక సంఘానికి ఆంధ్రప్రదేశ్ సమర్పించిన అంశాలు

పదిహేనో ఆర్థిక సంఘానికి నిర్దేశించిన విధివిధానాల ప్రకారం 2011 జనాభా లెక్కల ఆధారంగా వనరుల పంపిణీ జరిగితే ఆంధ్రప్రదేశ్ ఏటా దాదాపు రూ.1276 కోట్లు నష్టపోయే (-0.8 శాతం) అవకాశం ఉందని అసెంబ్లీ, పార్లమెంటు, ఆర్థిక సంఘాల వ్యవహారాలను విశ్లేషించే పాలసీ రీసెర్చి విభాగం (పీఆర్ఎస్) లెక్కకట్టింది. 'రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు' (స్టేట్ ఆఫ్ స్టేట్ ఫైనాన్సెస్) పేరుతో ఆ సంస్థ నివేదికను విడుదల చేసింది.

కేంద్ర ఆర్థికశాఖ నిర్దేశించిన విధివిధానాల ప్రకారం 15వ ఆర్థికసంఘం.. 2011 జనాభా లెక్కల ప్రకారం వనరుల పంపిణీకి సిఫార్సు చేయనుంది. ఇదే జరిగితే ఏపీ సహా జనాభా నియంత్రణను పటిష్టంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు పెద్దమొత్తంలో నష్టపోతాయని పీఆర్ఎస్ నివేదిక తెలిపింది. ఉదాహరణకు 2018-19 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ పన్నులు, సుంకాల్లో రాష్ట్రాలకు నికరంగా రూ.7,68,413 కోట్ల వాటా వచ్చింది. ఇదే మొత్తాన్ని జనాభా లెక్కల ప్రకారం పంపిణీ చేస్తే ఏపీకి అయిదేళ్లలో రూ.6,380 కోట్లు నష్టం వాటిల్లే ప్రమాదముంది. ఇదే సమయంలో బీహార్, హర్యానా, మధ్యప్రదేశ్, మిజోరం, నాగాలాండ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లు బాగా లబ్ధి పొందనున్నాయి. మరోవైపు 14వ ఆర్థిక సంఘం ప్రతిపాదించిన రెవెన్యూలోటు భర్తీ నిధులను కొనసాగించాలా? వద్దా? అన్న దానిపై కూడా 15వ ఆర్థికసంఘం సిఫారసు చేయాలని కేంద్రం నిర్దేశించింది. ఒకవేళ రెవెన్యూలోటును ఎత్తివేస్తే ఏపీలాంటి రాష్ట్రాలకు గోరుచుట్టుపై రోకటిపోటు పడినట్లవుతుంది. రోజువారీ అవసరాలు తీర్చుకోవడానికే ఏపీ మరిన్ని అప్పులు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల రాష్ట్ర మూలధన వ్యయం మరింత తగ్గిపోయి ఆస్తుల సృష్టి తగ్గుతుంది.

ఈ అంశాలన్నిటినీ పరిగణలోకి తీసుకోవటంతోపాటు.. ప్రత్యేక హోదా రాయితీలు, ఇతర విభజన హామీల అమలు సక్రమంగా లేకపోవటం వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెడుతూ ఏపీ తన డిమాండ్లను ఆర్థిక సంఘం ముందు ఉంచింది. ప్రధానంగా రాష్ట్ర సమస్యల మీదే ఏపీ దృష్టి సారించింది. అందులో కొన్ని:

- కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 50 శాతానికి పెంచాలి.

- 2020-21 నుంచి 2024-25 మధ్యకాలంలో రాష్ట్ర రెవెన్యూ లోటు గ్రాంట్ కింద రూ.4,79,823 కోట్లు ఇవ్వాలి.
- 1971 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకోవాలి. జనాభాకు 25 శాతం వెయిటేజీ, విస్తీర్ణానికి 15 శాతం వెయిటేజీ ఇవ్వాలి. వ్యవసాయ వృద్ధిని మినహాయించి తలసరి ఆదాయం లెక్కించి దానికి 47.5 శాతం వెయిటేజీ ఇవ్వాలి. జీఎస్‌డీపీకి 12.5 శాతం వెయిటేజీ ఇవ్వాలి.
- విభజన నేపథ్యంలో గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ కింద ఏపీకి రూ.69,687 కోట్లు ఇవ్వాలి.
- ఆర్థిక కష్టాల్లో ఉన్న ఏపీలాంటి రాష్ట్రాలకు వంద శాతం విపత్తు నిర్వహణ నిధులను కేంద్రమే భరించాలి.
- అమరావతి నిర్మాణానికి రూ.1,09,000 కోట్ల సాయం అందజేయాలి.
- వెనుకబడిన 7 జిల్లాలకు నిధుల్ని వెంటనే విడుదల చేయాలి. బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని అమలు చేయాలి.
- అటవీ విస్తీర్ణం పెంపునకు ఆర్థిక చేయూతనివ్వాలి.
- స్థానిక ప్రభుత్వాలకు నిధుల కేటాయింపు విషయంలో తలసరి ఆదాయం రూ.1000గా పరిగణించాలి.

ఈ డిమాండ్ల సాధనకు ఇతర రాష్ట్రాలతో కలిసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని ఏపీ భావిస్తోంది. ఇప్పటికే 15వ ఆర్థిక సంఘం విధివిధానాలను వ్యతిరేకిస్తూ ఏపీ, కేరళ, తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి ఆర్థిక మంత్రులు వరుస సమావేశాలు నిర్వహించారు.

అయితే ఇటీవల ఎన్నికలు జరిగి చంద్రబాబు స్థానంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అవటంతో.. 15వ ఆర్థిక సంఘానికి ఇచ్చిన వినతిపత్రంలో కొన్ని మార్పులు చేయాలని సూచించారు.

గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ విభాగంలో మరిన్ని అంశాలను చేర్చటంతోపాటు ప్రాధాన్య అంశాలను కూడా మార్చాలని కొత్త ప్రభుత్వం భావిస్తోంది. వీలైనన్ని ఎక్కువ ప్రాధాన్యాంశాలతో సాధ్యమైనంత ఎక్కువస్థాయిలో కేంద్రం నుంచి నిధుల్ని రాబట్టాలని నిర్ణయించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ, ఏపీకి ప్రత్యేక హోదా ఎందుకు అవసరమో 15వ ఆర్థిక సంఘానికి వివరించాలని జగన్ సూచించారు. దీనిపై అధికారులు మళ్లీ కసరత్తు చేస్తున్నారు.

14వ ఆర్థిక సంఘం సిఫార్సుల కాలపరిమితి 2020 మార్చి 31తో ముగుస్తుంది. 2020 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు 15వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమల్లో ఉంటాయి. ◻




**"పురోగామి సమాజంలో మనుషుల కంటే కూడా ప్రమాణాలే శిరోధార్యమవుతాయి. ఎందుకంటే తమ కోర్కెలు ఈడేర్చుకునే స్వభావం వల్ల మనుషులు అన్నిసార్లూ సమగ్రతతో, సమ్యక్ దృక్పథంతో చూడలేరు కాబట్టి".**

**- గాంధీజీ**

# ఎత్తిపోతల విద్యుత్తు వ్యయం ఏడాదికి రూ.10,500 కోట్లు, నిర్వహణ వ్యయం అదనం

| కొన్ని ప్రధాన ప్రాజెక్టుల కింద తెలంగాణలో 2024-25 సంవత్సరంలో కానున్న విద్యుత్తు ఖర్చులు | |
|---|---|
| ఎత్తిపోతల ప్రాజెక్టు | విద్యుత్తు ఖర్చు (రూ. కోట్లలో) |
| కాళేశ్వరం | 3,300 |
| పాలమూరు-రంగారెడ్డి | 3,028 |
| సీతారామ | 1,060 |
| కల్వకుర్తి | 1,050 |
| దేవాదుల | 840 |

తెలంగాణ రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకాలన్నీ పూర్తయితే ఏడాదికి విద్యుత్తు ఖర్చు రూ.10,500 కోట్లు అవుతుందని నీటిపారుదల శాఖ అంచనా వేసింది. పనులు పూర్తి చేసుకుని నీటి వినియోగం జరిగాక ఎక్కువ విద్యుత్తు ఖర్చయ్యే ప్రాజెక్టుల్లో కాళేశ్వరం మొదటిది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల రెండోది. ఈ రెండూ పూర్తిస్థాయిలో నీటిని ఎత్తిపోయడం మొదలైతే ఏడాదికయ్యే విద్యుత్తు ఖర్చు రూ.6,328 కోట్లు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్వహణ కీలకం. కాబట్టి ఇందుకు అవసరమయ్యే నిధులను కేంద్ర ప్రభుత్వం ఇచ్చేలా సిఫార్సు చేయాలని 15వ ఆర్థిక సంఘానికి చేస్తున్న విజ్ఞప్తుల్లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. సాగునీటి ప్రాజెక్టులకు విద్యుత్తు ఖర్చు, నిర్వహణ వ్యయంపై నివేదికను తయారుచేసిన నీటిపారుదల శాఖ 2020-21 నుంచి 2024-25 వరకు విద్యుత్తు ఛార్జీలు, నిర్వహణ వ్యయం రూ.40,000 కోట్లు అవుతుందని లెక్కగట్టింది. ఇందులో విద్యుత్తు ఛార్జీలకే రూ.37,000 కోట్లు. తెలంగాణలోని 18 ఎత్తిపోతల పథకాలకు కలిపి 11,722 మెగావాట్ల విద్యుత్తు అవసరమవుతుందని నివేదించారు. 2020-21 నాటికి అన్ని ఎత్తిపోతల పథకాలు పూర్తి కావు. పూర్తయినా ఆయకట్టంతా సాగు కాదు. దీని ప్రకారం విద్యుత్తు ఖర్చు రూ.2,500 కోట్లే. అయితే ఇది ఏటా పెరుగుతూ 2024-25 నాటికి రూ.10,500 కోట్లకు చేరుతుందని నీటిపారుదల శాఖ అంచనా వేసింది. ఎక్కువ విద్యుత్తు ఖర్చు అయ్యే ఎత్తిపోతలలో కాళేశ్వరం ఎత్తిపోతల, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, దేవాదుల, ఎల్లంపల్లి, ఎ.ఎం.ఆర్.పి ఉన్నాయి. అయిదేళ్లకు అయ్యే విద్యుత్తు, నిర్వహణ వ్యయాన్ని ఇచ్చేలా సిఫార్సు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘాన్ని కోరుతోంది.



కాగా, పెద్ద ఎత్తిపోతల పథకాలకయ్యే విద్యుత్తు, నిర్వహణ వ్యయాల కారణంగానే పలువురు నిపుణులు తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రత్యామ్నాయ ప్రణాళిక ఉండాలని డిమాండ్ చేశారు. వచ్చే దిగుబడి కంటే పెట్టే వ్యయాన్ని పెద్దఎత్తున పెంచేసే భారీ ఎత్తిపోతల కాబట్టే గతంలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును లోక్‌సత్తా కూడా గట్టిగా వ్యతిరేకించింది. లోక్‌సత్తా వాదనను ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అప్పట్లో సమర్థించారు. తెలంగాణలోని నీటి వనరుల్ని సద్వినియోగం చేసి గరిష్ఠస్థాయిలో భూములకు నీరివ్వాలనటంలో మరో మాట లేదు. కానీ తక్కువ ఖర్చుతో, తెలంగాణకు గుదిబండ కాకుండా సాగునీరందించేలా ప్రాజెక్టుల నిర్మాణం జరగాలన్నదే అందరి ఆకాంక్ష. నిపుణుల సూచనల్ని చర్చకు పెట్టి హేతుబద్ధంగా ప్రాజెక్టుల్ని నిర్మించి ఉంటే, మిగిలిన డబ్బును చిన్న పట్టణాలు – వ్యవసాయ అనుబంధ పరిశ్రమల అభివృద్ధి చుట్టూ యువత ఉపాధి సృష్టి కార్యక్రమాలకు వినియోగించి ఉంటే తెలంగాణకు జరిగే మేలు మరింత పెరిగేదనటంలో సందేహం లేదు. ◻

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

■ భాజపా సిద్ధాంతాలను, ఆ పార్టీ నేతలు విశ్వసించే హిందూత్వ వాదాన్ని వ్యతిరేకించేవారు సైతం ఈ ఎన్నికల్లో ప్రజలు జాతి, మతం హద్దులను కొంతమేరకు దాటి తమ తీర్పునిచ్చారని అంగీకరిస్తున్నారు. కొన్ని కులాలు కొన్ని పార్టీలకు ఓటుబ్యాంకులుగా ఉన్న విషయం దేశంలో కొత్త కాదు. ఆ కులాల్లోని యువతరం సైతం ఈసారి మోదీ వైపు మొగ్గిందని, ఆ మొగ్గుదల రెండు రాష్ట్రాలు మినహా దేశమంతా కనిపించిందని ఎన్నికల అనంతరం నిర్వహించిన సర్వేల్లో సైతం స్పష్టమైంది. ఒక వ్యక్తి దృఢ వ్యక్తిత్వం ఆధారంగా రాజకీయ తీర్పు ఇవ్వడాన్నిబట్టి దేశంలో కుల, మత సరిహద్దులు చెరిగిపోతున్నాయని చెప్పుకోగలమా లేదా అన్నదే ఇక్కడ కీలకం.

– ఎన్. రాహుల్ కుమార్

■ పార్లమెంటరీ ఎన్నికలను అధ్యక్ష తరహా ఎన్నికలుగా మార్చడంలో మోదీ సఫలమయ్యారు. మోదీ విజయంలో మీడియా పాత్రను చూద్దాం. కొత్త సంవత్సరం రోజున మోదీ ఒక టీవీ న్యూస్ ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూను అన్ని టీవీ చానెల్స్ ప్రసారం చేశాయి. ఆ తరువాత బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్‌తో ఒక 'రాజకీయేతర' సంభాషణా కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. దీనిని కూడా టీవీ చానెల్స్ పదేపదే ప్రసారం చేశాయి. చివరి పోలింగ్ రోజును మోదీ కేదార్‌నాథ్ యాత్ర చేశారు. నిజానికి ఇది రాజకీయ ప్రచారయాత్రే. కేదార్‌నాథ్ గుహలో మోదీ ధ్యానం చేస్తున్న దృశ్యాలను టీవీ చానెల్స్ పదేపదే ప్రసారం చేశాయి. ప్రతిపక్ష నాయకులను పూర్తిగా విస్మరించి ఎలక్ట్రానిక్ మీడియా మోదీకే అమిత ప్రచారమిచ్చింది. 2019 ఏప్రిల్‌లో టీవీ న్యూస్ చానెల్స్ ప్రధాని మోదీని మొత్తం 722 గంటలకు పైగా చూపించాయనీ, రాహుల్‌గాంధీని 252 గంటల పాటు మాత్రమే చూపించాయనీ టీవీ ఆడియన్స్ రీసెర్చి నివేదిక ఒకటి వెల్లడించింది. నిజానికి ఒక టీవీ చానెల్ ప్రధాని మోదీతో ఇంటర్వ్యూను ప్రతి ఓటింగ్ రోజునా ప్రసారం చేసింది! న్యూస్‌కు, ప్రాపగాండాకు మధ్య విభజన రేఖలు దాదాపుగా చెరిగిపోయాయి. ఫేస్‌బుక్‌లాంటి సామాజిక మాధ్యమ వేదికల నుంచి వాట్సాప్‌లాంటి మెసెంజర్ సర్వీస్‌ల దాకా అన్నీ మోదీని ప్రజల మనస్సుల్లో ఒక మహాశక్తిమంతుడైన నాయకుడుగా సుప్రతిష్ఠితం చేయడానికి విశేషంగా దోహదం చేశాయి. వార్తావరణంలో సర్వత్రా మోదీనే! మోదీ ధీరోదాత్త వ్యక్తిత్వం గురించిన కార్యక్రమాలకు ఎనలేని ప్రాధాన్యమివ్వడం జరిగింది. తన విధ్యుక్త ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వహించని ఎన్నికల సంఘానికి కూడా నరేంద్రమోదీ ధన్యవాదాలు చెప్పుకోవాలి. ఎన్నికల నియమావళిని అధికార పక్షం వారు ఎంతగా ఉల్లంఘిస్తున్నప్పటికీ ఈసీ మౌనంగా చూస్తుండిపోయింది. నమో టీవీ ప్రభుత్వ ప్రచార సాధనమే అని తెలిసి కూడా ఆ చానెల్ ప్రసారాలకు ఎన్నికల సంఘం ఎందుకు అనుమతించిందో దర్యాప్తు జరిపి తీరాలి. ప్రధానమంత్రి మోదీ కేదార్‌నాథ్ యాత్రకు సైతం అంతగా ప్రచారం కల్పించడం రాజకీయ సభ్యత, నైతికతకు విరుద్ధం. పోలింగ్ రోజున ఒక నాయకుడు మతపరమైన ఆచారాలను బహిరంగంగా పాటించవచ్చునా? మతపరమైన ప్రతీకలను ప్రదర్శించవచ్చునా? అలా చేయడం ఓటర్లను తమకు అనుకూలంగా ప్రభావితం చేయడానికే కదా? ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమే.

- రాజ్‌దీప్ సర్దేశాయి, సీనియర్ జర్నలిస్టు

■ ఈ ఎన్నికల్లో మోదీ దేశంలోని అన్ని ప్రాంతాల్లో హిందూయిజాన్ని వ్యాపింపజేసి దాన్ని ఇరుసుగా మార్చుకున్నారు. స్వేచ్ఛాయుత రాష్ట్రాల స్ఫూర్తికి ఇది విరుద్ధం. ఒక మతం నుంచి ఒకే దృక్పథం, ఒకే ఆలోచనా విధానం, ఒకే గ్రంథం నుంచి ఒకే దార్శనికత ఏర్పడే అవకాశం లేదు. అందువల్లే మన దేశం ఐకమత్యంగా ఉండటమే కాదు, ప్రతి దశాబ్దానికీ మరింత బలమైనదిగా, సురక్షితమైనదిగా ఎదుగుతోంది. అదే సమయంలో ఒకే సిద్ధాంతం కలిగిన పాక్ ముక్కలవుతోంది. వైవిధ్యతతో కూడిన సౌఖ్యం భారత్ ఆధునిక ప్రపంచానికి ఇచ్చిన గొప్ప కానుక. ప్రపంచంలో మరెక్కడా వేర్వేరు సంస్కృతులు సంయమనంతో లేవు. విభిన్నతకు భారత్ ఒక బ్రాండ్ అయితే, స్విస్ తత్వవేత్త కార్ల్ జంగ్ అన్నట్టు దాని మూలబిందువు మహాత్మాగాంధీ.

- శేఖర్ గుప్తా, ద ప్రింట్ చైర్మన్, ఎడిటర్-ఇన్-చీఫ్

■ మోదీ ఓడిపోవాలని ఇవ్వాళ కోరుకున్న రాజకీయనేతలెవ్వరూ అతన్ని ఓడించడానికి నిజంగా చేసిందేమీ లేదు. మోదీ బలం అతని విభజనశీలతలో ఉన్నదని, అతని సిద్ధాంతంలో ఉన్నదని తెలిసి కూడా దానిమీద గురిపెట్టిన వాడే లేడు. వీవీప్యాట్లలో తొండి చేసి గెలవాలి తప్ప ఈ దేశ ప్రజలు స్వచ్ఛందంగా మోదీ వంటి వారిని ఎన్నుకోరులెమ్మన్న ఒక ఆత్మవంచన. ప్రజలు మోదీ విధానాల బాధితులు కాబట్టి, వారంతట వారే విరక్తులై అతన్ని గద్దెదింపాలన్నది మధ్యతరగతి ఆకాంక్ష. స్వప్నచక్షువులకు కావలసిన నిషాను అందిస్తే, బాధాగ్ని కుసుమాలను ఆఘ్రాణించడానికి ఈ దేశ ప్రజలు ఎప్పుడూ రెడీ. మోదీని మరిన్ని సార్లు గెలిపించి, జర్మనీలో అసంపూర్తిగా ముగిసినదాన్ని కొనసాగించడానికి కూడా ఈ దేశ ప్రజలు ఎప్పుడూ సైద్ధాంతికంగా వెనుకాడరు. మరో దారిని సాధన చేసే వారు లేకపోతే ఈ దేశ ప్రజలైనా మనుషులను ఊచకోతలూ కోస్తారు, ఫాసిజాన్నీ వరిస్తారు.

– కె. శ్రీనివాస్, సీనియర్ సంపాదకులు

■ రాజకీయం కూడా వైద్యం లాంటిదే. ఆస్పత్రిలో స్కాన్ చేసి, రోగులకు చికిత్స చేస్తాను. పాలనలో విధానాలను స్కాన్ చేసి వాటిని మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తుంటాను. ప్రధాని కార్యాలయంలో నా కుర్చీ వెనుక డాక్టర్ కోటు వేలాడుతుంటుంది. ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారిస్తానని చేసిన ప్రతిజ్ఞను ఇది గుర్తుచేస్తుంటుంది.

- లొటే షెరింగ్, భూటాన్ ప్రధానమంత్రి

■ ***యూపీలో యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకి వచ్చాక కూడా, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తగ్గలేదని, ఎమ్మెల్యేలు పోలీస్ స్టేషన్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. 'మాయావతి, అఖిలేష్‌లను బుట్టలో వేసుకుని ఒక నిర్ణయం తీసుకునేలా చేయడం అంత సులభం కాదు, కాని ఆదిత్యనాథ్‌ను ఒక నిర్ణయం తీసుకునేలా చేయడం చాలా సులభం. ఎందుకంటే ఆయనకు ప్రభుత్వ పాలన గురించికానీ, ఏ నిర్ణయాల వల్ల ప్రజల జీవితాల్లో సమూలంగా మార్పులు వస్తాయన్న విషయంలో కాని అంత అవగాహన లేదు' అని ఒక ఐపీఎస్ అధికారి చెప్పారు. 'యోగులు, స్వాములు తమ పీఠాల్లో, మఠాల్లో ఉన్నంత కాలమే ప్రజలకు వారంటే గౌరవం ఉంటుంది. వారికి అధికారం అప్పజెబితే అస్తవ్యస్త పరిస్థితులు తప్ప మరేమీ ఏర్పడవు. పైగా రాగద్వేషాలకు, కుల సమీకరణలకు అతీతం కాని యోగులు అధికారంలోకి వస్తే ఇంకా సమస్యలు వస్తాయి' అని సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అయిన ప్రముఖ రచయిత చెప్పారు.***

**- ఎ. కృష్ణారావు, సీనియర్ జర్నలిస్టు**

■ పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేయటం, ప్రభుత్వ ఉద్యోగులతో సత్ఫలితాలను సాధించడమనే ప్రస్తుత ఆవశ్యకతని గుర్తించి నిబద్ధతతో కృషి చేసినట్లయితే బంగారు తెలంగాణ, ప్రజల ఆకాంక్షలు నెరవేరగలవని ఆశించవచ్చు.

– డాక్టర్ వల్లాల వెంకట్ కన్నా

■ ఉద్యోగావకాశాలు సృష్టించేలా ప్రణాళికలు రూపొందించడం ద్వారా మాత్రమే ప్రస్తుత దుస్థితి నుంచి బయటపడగలం. అందుకోసం ముందుగా ఆర్థిక వృద్ధిపై సర్కారు దృష్టి సారించాలి. ఆర్థిక పరిపుష్టికి, ఉద్యోగ కల్పనకు ప్రత్యక్ష సంబంధం ఉందన్నది నిర్వివాదం. అందువల్లే 'భారత్‌లో తయారీ' వంటి పథకాల ద్వారా ఆర్థిక వృద్ధిని పరుగులు పెట్టించాలనే తలంపుతో కేంద్రం పనిచేస్తోంది. అయితే ఇది కేవలం నినాదంగా మిగిలిపోయిందన్నది నిపుణుల అభిప్రాయం. ఆర్థిక వృద్ధికి సంబంధించి దేశం ఒక విచిత్రమయిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. అయిదేళ్లలో సగటున 6.5 శాతం వృద్ధి చెందింది. గత రెండు సంవత్సరాల్లో 7.6 శాతం పైగానే ఉంటోంది. ఈ వృద్ధి రేటును 2018-2023 మధ్యకాలానికి ఎనిమిది, 2022-23 నాటికి 9-10 శాతానికి చేర్చాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. అందుకుతగ్గ కార్యాచరణలోనే ప్రభుత్వం విఫలమవుతోంది. దేశంలో పెట్టుబడులు పెరుగుతున్నా, ఉద్యోగ కల్పన జరగడం లేదు. పెట్టుబడి అంతా 'మూలధన ఆధారిత' పరిశ్రమలవైపు మళ్లడమే దీనికి కారణం. అవి 'శ్రామిక ఆధారిత' పరిశ్రమల వైపు మళ్లితే పరిస్థితి మరోరకంగా ఉంటుంది. అప్పుడు కొత్త ఉద్యోగాలు పెద్దసంఖ్యలో పుట్టుకొస్తాయి. ప్రభుత్వ విధానాలు సైతం ఉద్యోగకల్పనకు దోహదం చేసేలా ఉండాలి.

– ఆచార్య కోదాటి వియ్యన్నరావు, పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, సోషల్ మీడియా)

# ప్రజలకు - పరిపాలనకు లింకు తెగిపోయింది..
# స్థానిక ప్రభుత్వాలను పటిష్ఠం చేయటమే సంక్షోభానికి పరిష్కారం

ప్రజలకు, పరిపాలనకు మధ్య లింకు తెగిపోవటమే ఈవేళ మన రాజకీయం ఎదుర్కొంటున్న పెద్ద సంక్షోభమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రజలకు పరిపాలన అర్థం కాకపోవటమంటే అది ప్రజాస్వామ్య వైఫల్యమేనన్నారు. ప్రధానంగా స్థానిక ప్రభుత్వాలు బలహీనపడి నామమాత్రంగా మారటం వల్లే ఈ సంక్షోభం తలెత్తిందన్నారు. ప్రజల రోజువారీ అవసరాలు తీరటానికి, వారికి ఎదిగే అవకాశాలు అందటానికి కీలకమైన ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటి అంశాలు బలహీన స్థానిక ప్రభుత్వాల వల్ల తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. గతంలో స్థానిక పాలన మెరుగ్గా ఉన్నప్పుడు ప్రభుత్వం కొద్దిపాటి ఖర్చు చేసినా విద్యలో మంచి ఫలితాలు వచ్చాయని, ఈవేళ ప్రపంచంలో హార్వర్డ్, కొలంబియా లాంటి విశ్వవిద్యాలయాల్లో, అంతర్జాతీయ స్థాయి మేధావులతో, సమావేశాల్లో దీటుగా మాట్లాడే శక్తి తనలాంటి వారికి రావటానికి పునాదిని అప్పట్లో ప్రభుత్వ పాఠశాలలే వేశాయని అన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.40,000 కోట్లు ఖర్చు చేస్తున్నా నాణ్యమైన విద్య వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇన్ని వేల కోట్లు ఖర్చవుతున్నా, తల్లిదండ్రుల్లో విద్య పట్ల ఎంతో ఆరాటం ఉన్నా.. ఎందుకు పిల్లలకు మంచి చదువు రావటం లేదు అన్న లోతైన చర్చ ప్రభుత్వంలో, సమాజంలో కరువైందన్నారు. ఆరోగ్య రంగానికైతే నిధుల కేటాయింపు కూడా అధ్వాన్నంగా ఉందన్నారు. 70 ఏళ్ల స్వతంత్రం తర్వాత కూడా ఇంకా కోట్లాది ప్రజలకు సరైన చదువు, ఆరోగ్యం లేదంటే తలదించుకోవాలన్నారు.

తెలంగాణ లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నేత తుమ్మనపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయబ్ హాల్‌లో జరిగిన 'స్థానిక ప్రభుత్వాలు - సాధికారత









ఆవశ్యకత' అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో జేపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

జాతీయస్థాయి, రాష్ట్ర స్థాయి ప్రభుత్వాలతో సమానంగా స్థానిక ప్రభుత్వాలు ఉండాల్సుండగా, వాటిని నిర్వీర్యం చేసి అధికారాన్ని ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి చేతుల్లో కేంద్రీకరించారని, దీనివల్ల పలు అనర్థాలు జరుగుతూ ప్రజాస్వామ్యం బలహీనపడుతోందని జేపీ

అన్నారు. దీనివల్లే.. రాజకీయమంటే ఎన్నికలు, ఎన్నికలంటే ఎలాగోలా డబ్బు వెదజల్లి గెలవటమనే యుద్ధ వాతావరణం నెలకొందన్నారు. తమ ఓటుకు – తమ పన్నుల డబ్బుకు – తమ జీవితాలకు మధ్య సంబంధం ప్రజలకు అర్థం కాకపోవటం వల్ల ఓటు ఓ తాకట్టు వస్తువుగా తయారైందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వేల కోట్ల రూపాయల మిగులుతో ఏర్పడినా ఇప్పుడు ఏమీ కనిపించడం లేదని, వృథా ఖర్చులు పెరగడం వల్లే అప్పుల పాలవుతున్నారని అన్నారు.





కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యేల జేబులు నింపివేస్తున్నారన్నారు. ఆర్థికంగా గ్రామాలకు జవసత్వాలు లేకుండా చేశారని, స్వావలంబన, ఆలోచనాశక్తి గల నాయకత్వం లేకుండా చేశారని అన్నారు. ఎవరూ ఎదురుతిరగకుండా తాగుబోతులుగా మార్చారన్నారు. కాస్త గౌరవంగా బతుకుతూ ఎదుగుదామనుకున్న యువత ఊరు వదిలి వలన పోవటం తప్ప గతిలేని పరిస్థితుల్ని కల్పించారన్నారు. అధికారాన్ని ప్రజలకు దూరం చేయడమే, ప్రజలకు–పాలనకు లింకు లేకుండా చేయటమే ఇన్ని అనర్థాలకు మూలకారణమన్నారు. పాలకుల్లో మనుషులు మారుతున్నారు తప్ప పాలన మారకపోవటం వల్ల సంక్షోభం పెరుగుతూ వస్తోందన్నారు. ప్రజలకు అధికారాన్ని ప్రత్యక్షంగా కట్టబెట్టినప్పుడే మార్పు సాధ్యమన్నారు.



సామాన్య ప్రజలకు సరైన రోజువారీ సేవలు, మంచి విద్య, ఆరోగ్యం అందాలంటే స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, సిబ్బందిని, అధికారాల్ని బదిలీ చేయాలని, అధికార వికేంద్రీకరణే నేటి సంక్షోభానికి పరిష్కారమని జేపీ అన్నారు. గ్రామాలు, పట్టణ కేంద్రాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే ఏర్పాటు చేస్తేనే దేశం అభివృద్ధి

చెందుతుందితప్ప.. ఎంత బలమైన నాయకులమని చెప్పుకునేవారు అధికారంలోకి వచ్చినా ప్రయోజన ముండదన్నారు. ఇంటి ముందు ప్రభుత్వం.. కంటి ముందు పాలన అందించాలన్నారు.

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టంలో కొన్ని లోపాలున్నా మెరుగ్గానే ఉందని, అయితే కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చినట్లే రాష్ట్రం కూడా ఆర్థిక సంఘం ద్వారా స్థానిక ప్రభుత్వాలకు (జిల్లా, మండల, మునిసిపాలిటీ, గ్రామీణ ప్రాంతాలకు) 50 శాతం నిధులను కేటాయించాలని జేపీ అన్నారు. స్థానికంగా అవినీతి జరిగితే అంబుడ్స్‌మన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చన్నారు. చిన్న పంచాయతీలు కాకుండా.. కొన్ని గ్రామపంచాయతీలను సముదాయం (క్లస్టర్)గా ఏర్పాటు చేసి యూనిట్‌గా పరిగణిస్తే ఆదాయాన్ని, సేవల్ని కూడా మెరుగుపరచుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేకుండా ప్రజలకు హక్కుగా సేవలందించేందుకు పౌర సేవల చట్టాన్ని తేవాలన్నారు.

తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య కోదండరాం మాట్లాడుతూ, లోక్‌సత్తాతో కలిసి పనిచేసేందుకు తాము సిద్ధమన్నారు. మునిసిపల్ ఎన్నికలకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు.

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, పాలక పార్టీలకు అధికారంలో ఎలా కొనసాగాలి అన్న యావ తప్ప ప్రజలకు మెరుగైన పాలనను ఎలా అందించాలి అన్న ధ్యాస లేకుండా పోయిందన్నారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చటం వల్ల ఏమీ ఉపయోగం లేకుండా పోయిందని సీపీఎం నేత సారంపల్లి మల్లారెడ్డి అన్నారు.

ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాల సాధికారత దిశగా పలు తీర్మానాలను సమావేశం ఆమోదించింది.

జనసేన నేతలు శంకర్ గౌడ్, ప్రకాష్, లోక్‌సత్తా ఉద్యమసంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ జాతీయ కమిటీ సభ్యులు కటారి శ్రీనివాసరావు, రాష్ట్ర నేతలు రవీందర్, సరోజాదేవి, గజానని, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. □

**LOKSATTA PARTY TELANGANA STATE**

**లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్రం**

**402, తులిప్స్ భవన్, ఎర్రమంజిల్, పంజాగుట్ట - హైద్రాబాద్**

**చర్చాపత్రం**

**రౌండ్‌టేబుల్ సమావేశం: స్థానిక ప్రభుత్వాలు - సాధికారత: ఆవశ్యకత**

**ప్రధాన డిమాండ్లు:**

- మున్సిపల్ చైర్మన్ / నగర మేయర్ పదవికి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి.
- స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, విధులు, నిధులు, సిబ్బందిని బదలాయించాలి.
- రాష్ట్ర బడ్జెట్‌లో 50% నిధులను స్థానిక (జిల్లా - మండల - గ్రామ- మున్సిపాలిటీ) ప్రభుత్వాలకు కేటాయించాలి.
- మున్సిపల్ సవరణ చట్టం - పౌరసేవలు హక్కుగా చట్టం రావాలి. అంబుడ్స్‌మన్ ఏర్పాటు చేయాలి.

ఎజెండా అంశాలు :

**1. స్థానిక సంస్థలు - స్థానిక ప్రభుత్వాలు:**

రాజ్యాంగంలో స్థానిక ప్రభుత్వాలుగా నిర్దేశించినప్పటికిని వాటిని దురుద్దేశ్యంగా స్థానిక సంస్థలుగా చిత్రీకరించి నిర్వీర్యం చేశారు. రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా స్థానిక ప్రభుత్వాలుగా తీర్చదిద్దవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**2) స్థానిక ప్రభుత్వాలు - ఎన్నికలు:**

పట్టణ/నగర ప్రజలకు ఓటుహక్కు లేకుండా చేసిన రాజకీయ పార్టీల వైఖరి మారాలి. గ్రామ సర్పంచ్ మాదిరిగానే మున్సిపల్ చైర్మన్/నగర మేయర్ పదవికి ప్రత్యక్ష ఎన్నికల ద్వారానే ఎన్నుకోవాలి. మండలాధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్ పదవులకు ప్రత్యక్షంగా ఎన్నికలు జరిగేలా చేయాలి.

**3) 73, 74 రాజ్యాంగ సవరణలు -అమలు:**

73,74 రాజ్యాంగ సవరణల ద్వారా సంక్రమించిన అధికారాలు, విధులు, నిధులు, సిబ్బందిని స్థానిక ప్రభుత్వాలకు వెంటనే దాఖలు పరచాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం.

**4) రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ :**

జాతీయ స్థాయి మాదిరిగానే రాష్ట్రంలో ప్రతీ 5 ఏళ్లకి క్రమం తప్పకుండా తప్పనిసరిగా రాష్ట్ర ఫైనాన్స్ కమిటీని నియమించాలి.

**5) ఫెడరల్ సిస్టం - స్ఫూర్తిగా :**

కేంద్ర - రాష్ట్ర ఆర్థిక సంబంధాల మాదిరిగానే రాష్ట్ర - స్థానిక ప్రభుత్వాలకు (జిల్లా - మండల - గ్రామ- మున్సిపాలిటీ)లకు రాష్ట్ర బడ్జెట్‌లో భాగంగానే 50% నిధులను నేరుగా కేటాయింపులు వుండాలి.

**6) అభివృద్ధి ప్రణాళిక రచన :**

జిల్లా - మండల - గ్రామాల సమగ్ర అభివృద్ధికి "ప్రజాప్రణాళికలను" రూపకల్పన చేసి అమలుకు కార్యాచరణను ప్రకటించాలి. స్థానిక ప్రభుత్వాలకు చెందిన ప్రజా ప్రతినిధులకు నిరంతరం శిక్షణా తరగతులు నిర్వహించాలి.మున్సిపల్ వార్డులలో కౌన్సిలర్ అధ్యక్షతన వార్డు కమిటీలు ఏర్పాటు చేయాలి.

**7) అంబుడ్స్‌మన్ ఏర్పాటు - మున్సిపల్ సవరణ చట్టం:**

పౌరసేవలు హక్కుగా పొందడాన్ని చట్టంగా చేయాలి. సీటిజన్ ఛార్టర్‌ను విధిగా అమలు చేయాలి. అధికార బదలాంపుపై విచారణ అధికారం, ఆర్థిక క్రమశిక్షణ లోపించిన, అధికార దుర్వినియోగం, అవినీతి -అక్రమాలను విచారించడానికి జిల్లాస్థాయిలో "అంబుడ్స్‌మన్" ఏర్పాటు చేయాలి.




# యంగ్ లీడర్స్ ఫర్ యాక్టివ్ సిటిజన్‌షిప్

దేశ ప్రజాస్వామ్యానికి నిజమైన రక్షకులైన క్రియాశీల పౌరులుగా వ్యవహరించేందుకు కావలసిన పాలనా, రాజకీయ పరిజ్ఞానాన్ని, వివిధ రకాల పద్ధతుల్ని హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఔత్సాహిక యువ నాయకులకు వివరిస్తున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్



Posting Date 22-06-2019
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2019-21 Published on June16th, 2019










# భారత్‌లో ఉదారవాదం ఎంత?

రాజ్యాంగం చెబుతోంది కాబట్టి మనది ఉదారవాద సమాజమని చెప్పుకోలేమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఉదారవాద ప్రజాస్వామ్యానికి చట్టబద్ధ పాలన కీలకమన్నారు. ఢిల్లీలో జరిగిన 'హౌ' లిబరల్ ఈజ్ ఇండియా ' (భారత్ ఏ మేరకు ఉదారవాద దేశం) పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మన విలువల్ని ప్రజల జీవితాలకు అన్వయించకుండా, తాము ఏం కోల్పోతున్నామో ప్రజలు అర్థం చేసుకోకుండా మనమెంత మాట్లాడుకున్నా దేశంలో పరివర్తన సాధ్యంకాదని ఈ సందర్భంగా జేపీ అన్నారు. ఉదార ఆర్థిక విధానాలను అమలు చేయకపోవటం వల్లే... దేశంలో ఏటా 130 లక్షల మంది (1-3 కోట్ల మంది) కొత్తగా ఉద్యోగాల కోసం వస్తున్నా కూడా వారికి తగినన్ని ఉపాధి అవకాశాల్ని ప్రభుత్వం కల్పించలేకపోతోందన్నారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా భారతదేశం సంకుచిత మూఢవిశ్వాసాల్లోకి జారి పోయే దేశం కాదనే విశ్వాసాన్ని జేపీ వ్యక్తం చేశారు.

Book-Post
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad